# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 | సంచిక : 6 | విజయవాడ 20-7-2011 | పేజీలు : 8 | వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- భారత ఆఫ్రికా వేదిక: బయటపడ్డ భారత విస్తరణవాద కాంక్షలు
- గ్రీసు: సంక్షోభాన్ని తీవ్రంచేసిన ఐయంఎఫ్-ఇయు
- ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత సింగరాజు శతజయంతి
- పొగాకు పంటకు గిట్టుబాటు ధరకై ఉద్యమిద్దాం!


## అమరుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి చూపిన బాటలో పయనిద్దాం!

## దేశానికి నిజమైన స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని సాధిద్దాం!!



**భారతదేశం** జన్మనిచ్చిన అసలు సిసలైన ప్రముఖ దేశ భక్తులలో ఒకరు, కమ్యూనిస్టు విప్లవకర ఉద్యమంలో ఉద్భవించిన ఉత్తమోత్తమ సారథులలో ఒకరు, భారత దేశంలో పుట్టిన అరుదైన మహావ్యక్తులలో ఒకరు, భారత విప్లవకర రాజకీయ రంగంలో 35 సంవత్సరాలకు పైగా వెలుగొందిన గొప్ప విప్లవయోధుడు, ప్రత్యేకించి ప్రజలను ప్రగాఢంగా ప్రేమించిన అసాధారణ వ్యక్తి-కామ్రేడ్ టి.ఎన్.

బ్రిటీష్ పాలకుల నుండి 1947లో అధికారం బదలాయింపు జరిగి 25 సంవత్సరాలు నిండినా భారత దేశంలోని ప్రజల నికృష్టమయిన జీవన స్థితిగతుల పట్ల ఆయన ఎంతగానో కలత చెందారు. సోషలిస్టుగా చెప్పబడే నెహ్రూ నాయకత్వంలో కూడా భారతదేశపు పరిస్థితులు బ్రిటీష్ వలసపాలకుల కాలంనాటి కన్నా కూడా దిగజారి పోవటానికి కల కారణాలను ఆయన సునిశితంగా పరిశీలించారు. మార్క్సిజం-లెనినిజం అనే శాస్త్రీయ అవగాహనా కొలిమిలో పరిస్థితులను పుటంపెట్టి విశ్లేషించి, దేశంలోని పరిస్థితులు దిగజారిపోవటానికి గల కారణాలను నిగ్గుదేల్చారు.

1947లో తెల్లదొరల నుండి నల్లదొరలకు కేవలం అధికారమార్పిడి మాత్రమే జరిగిందనీ, సామ్రాజ్యవాదులతో రాజీపడిన భారత బూర్జువావర్గపు, దేశప్రజల స్వాతంత్ర ఆకాంక్షను పూర్తిగా అణచివేస్తామన్న నీచమైన ఒప్పందం యొక్క పర్యవసానమే 1947 నాటి అధికార మార్పిడి అనీ ఆయన సోదాహరణ పూర్వకంగా నిరూపించారు. భారతదేశానికి చేకూరినది నిజమయిన స్వాతంత్ర్యం కాదనీ, 25 సంవత్సరాల అధికారమార్పిడి అనంతరం కూడా స్వాతంత్ర్యం అనేది ఒక ఎండమావిలాగానే మిగిలిపోయిందని ఆయన 1971లో తన ప్రముఖ కోర్టు ప్రకటన అయిన 'తాకట్టులో భారతదేశం' ద్వారా ప్రకటించారు. పాలితులైన భారతీయులు ఎప్పుడైనా తిరగబడగలరన్న భయంతో బ్రిటీష్ పాలనా కాలంలో ఏర్పడిన అన్ని సంస్థలనూ, చట్టాలనూ, శిక్షాస్మృతులనూ, పాలనా వ్యవస్థనూ, ఎటువంటి మార్పులూ జరుపకుండా యధాతథంగా కొనసాగిస్తూ దానినే ప్రజాస్వామ్యవ్యవస్థ, స్వతంత్ర వ్యవస్థ అంటూ భారత పాలకులూ-పాలకవర్గాలూ ప్రజలను నమ్మబలుకుతున్న దానిలో గల మోసాన్నీ , కుతంత్రాన్నీ ఆయన బట్టబయలు చేశారు.

విదేశీ పెట్టుబడిపై భారతదేశం యొక్క పరాధీనత పెరిగిపోతోందని, దీని ఫలితంగా భారతదేశ ఆర్థిక-రాజకీయ వ్యవహారాలపై విదేశీ పెట్టుబడి ఆధిపత్య స్థానాన్ని ఆక్రమించుకొందనీ ఆయన ఆందోళన చెందారు.

అటు విదేశీ పెట్టుబడికీ, యిటు దేశంలోని ఫ్యూడల్ వర్గాలకూ దాసోహం చేసే విధానాలను భారతపాలకులు అమలు జరపటం వలన దేశంలోనూ ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలో పేదరికం చాలా అసాధారణంగా, ఊహించటానికి వీలులేని పరిమాణాలలో పెరుగుతున్న వైనాన్ని ఆయన స్పష్టపరిచారు. ఈ కారణం రీత్యానే దేశంలో నిరుద్యోగం, నిరక్షరాస్యతలు పెరిగిపోతున్న ఆందోళనకరమైన పరిస్థితి గురించి ఆయన వివరించారు.

దేశంలోకి విదేశీ ప్రవేటు పెట్టుబడి ప్రవహించటం వలన, అది విదేశీ మారక సంక్షోభాన్ని తీవ్రపరుస్తుందనీ, నిరంతరాయంగా దేశం నుండి జరిగే సంపద తరలింపు వలన తిరిగి పెట్టుబడి పెట్టడానికి వీలులేకుండా పెట్టుబడి సమీకరణను కుదించివేస్తుందని ఆయన సోదాహరణంగా వివరించి, విదేశీ పెట్టుబడి దేశాన్ని శాశ్వతంగా పరాధీనం చేస్తుందని ధృఢంగా నొక్కి చెప్పారు. తన మార్క్సిస్టు-లెనినిస్టు విశ్లేషణాత్మక వివరణ ద్వారా కామ్రేడ్ నాగిరెడ్డి భారతసమాజంపై సామ్రాజ్యవాదమూ, ఫ్యూడలిజమూ ఆధిపత్యం వహిస్తున్నాయని నిర్ధారించారు.

కామ్రేడ్ నాగిరెడ్డి అమరులై 35 సంవత్సరాలైంది. ఈ 35 సంవత్సరాల కాలంలోనూ దేశంలో జరిగిన పరిణామాలూ, ఘటనలూ, ఆయన చేసిన నిర్ధారణలు నూటికి నూరుపాళ్ళూ సరైనవేనని నిరూపించాయి, నిరూపిస్తున్నాయి.

కామ్రేడ్ నాగిరెడ్డి 1976 జూలై 28న ఎమర్జన్సీ కాలంలో అనారోగ్యంతో అమరులయ్యారు. ఆయన అమరులైన అనతికాలంలోనే, అంటే 1989 నాటికే కేవలం 13 సంవత్సరాల కాలంలోనే ఆయన చేసిన నిర్ధారణలు అక్షర సత్యాలై కూర్చున్నాయి.

దేశంలో అధికారంలోకి వచ్చిన వివిధ పార్టీల ప్రభుత్వాలన్నీ విదేశీ పెట్టుబడికి పెద్దపీటవేసే ఆర్థిక విధానాలను అమలు చేయటం వలన వి.పి. సింగ్ ప్రభుత్వకాలం నాటికే దేశం తీవ్రమయిన విదేశీ మారక సంక్షోభంలోకి కూరుకుపోయింది. ఈ సంక్షోభం నుండి బయటపడటం కోసం వి.పి. సింగ్, చరణ్‌సింగ్‌ల ప్రభుత్వాలు సామ్రాజ్యవాద ఆర్థికసంస్థలయిన ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్‌లముందూ, జపాన్ ప్రభుత్వం ముందూ మోకరిల్లాయి. తాము కూరుకుపోయిన విదేశీమారక సంక్షోభం నుండి బయటపడటం కోసం తిరిగి అప్పుయిమ్మంటూ కాళ్ళావ్రేళ్ళా పడ్డారు. ఎంత వడ్డీఅయినా యిస్తామని దేవుళ్ళాడారు. అయినా ఆ సామ్రాజ్యవాద సంస్థలు తమకు అప్పుతీర్చగలుగుతామని నమ్మించే హామీని కోరారు. భారతదేశంలో ప్రభుత్వాలు నిలకడగా వుండకపోవటం వలన, తాము నమ్మి ఎలా అప్పు యివ్వగలం? అనే వైఖరిని చేబట్టారు. ఈలోగా పి.వి. నర్సింహారావు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రి అయ్యారు. ముందు తక్షణ సమస్యను తీర్చుకోవటం కోసం రహస్యంగా దేశంలోని బంగారాన్ని, స్టేట్ బ్యాంకు ద్వారా లండన్ తరలించి దాన్ని అమ్మివేసి తాత్కాలికంగా బయటపడ్డారు. అనంతరం ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్.లతో వారు విధించిన షరతులకు అంగీకరించి దేశంలో సామ్రాజ్యవాద ప్రయోజనాలను పెంపొందించే నయా-ఉదారవాద సరళీకరణ ఆర్థిక విధానాలను అమలు జరుపటాన్ని ప్రారంభించారు. తిరిగి మరోసారి బంగారాన్ని రహస్యంగా లండన్ తరలించి అక్కడ బ్యాంకులో హామీగా వుంచారు. ఆ రకంగా పి.వి. నరసింహారావు -మన్మోన్‌సింగ్‌ల సారధ్యంలో విదేశీ పెట్టుబడి ప్రవేశంపైగల నామమాత్రపు ఆంక్షలు కూడా తొలగింపబడ్డాయి. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రపంచీకరణ విధానాల అమల్లో భాగంగా భారతదేశంలోకి విదేశీ ప్రవేటు పెట్టుబడి యధేచ్ఛగా ప్రవేశించి,

(తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

## ప్రమాద భరితమైన రైల్వేలు

**నాలుగు** రోజుల్లో మూడు పెద్ద రైల్వే ప్రమాదాలు; దాదాపు వందకు పైగా మరణాలు; మూడువందలు దాటిన గాయపడినవారి సంఖ్య; అందులో పలువురి పరిస్థితి విషమం-రైలు ప్రయాణం ఎంత ప్రమాదకరంగా మారిందో తెలుపుతున్నాయి. ఉత్తరప్రదేశ్ కాన్షీరాం జిల్లాలో కాపలాలేని లెవల్‌క్రాసింగ్‌వద్ద పెళ్లిబృందం ప్రయాణిస్తున్న బస్సును ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్ రైలు 38మంది ప్రాణాలను బలిగొంది. అదే రాష్ట్రంలో కల్కామెయిల్ ఇంజనుతోపాటు 15 బోగీలు పట్టాలుతప్పి, బోల్తాకొట్టి 68 మంది ఉసురుతీసింది. పట్టాలపై ప్రేలుడు సంభవించి అస్సాంలో గౌహతీ-పూరీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి 93మంది గాయపడ్డారు. ఇవికాక పత్రికల్లో పతాక శీర్షికలకెక్కని గూడ్సురైళ్ల ప్రమాదాలెన్నో జరుగుతున్నాయి. లైనుమెన్‌లు, డ్రైవర్ల సమయస్ఫూర్తితో తప్పిపోయిన ప్రమాదాల వార్తలు తరచుగా వస్తూనేవున్నాయి. ఇవి అరుదైన ఘటనలు కావనీ, రైల్వేల భద్రతకు సంబంధించిన అన్ని అంశాల్లోనూ-ఇంజన్లు, బోగీలు, పట్టాలు, స్లీపర్లు, సిగ్నలు పరికరాలు-నిర్వహణా, పర్యవేక్షణల్లో సంస్థాగతంగా దిగజారిన పరిస్థితిని తెలుపుతున్నాయి.

ప్రమాదాలు మానవ తప్పిదాలనీ, విద్రోహచర్య పాత్రకు గల అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నామనీ అధికారులు ప్రకటించి చేతులు దులుపుకుంటున్నారు. కాపలాలేని క్రాసింగుల వద్ద జరిగే ప్రమాదాలకు రైల్వేలకు బాధ్యతలేదనీ, పట్టాలు దాటే వాహనాలే జాగ్రత్త వహించాలనీ రైల్వేల వాదన. ఇక్కడ ప్రమాదాలవల్ల నష్టపోయేది పరిసర గ్రామాల వారే గనుక వారినే కాపలాపెట్టుకోమనాలనీ, కాపలాదారులకు గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులనుండి కొంత చెల్లింపు చెయ్యాలనీ కొందరు నిపుణుల సూచన. ఏడుస్తున్న పసివాడిని చందమామను చూపి తల్లి ఊరడించినట్లు ఈ నిపుణులనే వారందరికీ అన్నింటికీ ఉపాధిహామీ పథకం నిధులే కన్పిస్తాయి. కాపలాలేని క్రాసింగులవద్ద రైలు రాబోతుందని హెచ్చరిస్తూ ఎర్రసిగ్నలు ఏర్పాటు చేస్తే ఈ ప్రమాదాలు నివారించవచ్చునన్న సూచన చేయటానికే వీరికి నోరు రాదు. అస్సాంలో రైలు ప్రమాదానికి కారణమైన ప్రేలుడు మేమే చేసామని పేరెప్పుడూ వినని ఆదివాసీ పీపుల్సు ఆర్మీ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అలాగే గంటకు 108 కి.మీ వేగంతో ప్రయాణిస్తున్న కల్కా మెయిలు డ్రైవరు అత్యవసర బ్రేకువేసినందున పట్టాలుతప్పినట్లు ప్రాథమిక విచారణలో తేలిందనీ, అలా అత్యవసర బ్రేకు ఎందుకు వేయాల్సివచ్చిందో పరిశీలిస్తున్నామనీ, విద్రోహ చర్యను గమనించే బ్రేకు వేశాడా అన్నది పరిశీలనలో తేలాల్సివుందని అధికారులంటున్నారు. దీనిలో వాస్తవాస్తవాలు తేలవలసివున్నా, బాంబులు పెట్టివుంటే 24 గంటలూ కాపలా ఉండాల్సిన లైన్‌మెన్లు ఏమయ్యారు? అత్యవసర బ్రేకువేస్తే బండి పట్టాలెందుకు తప్పాలి? పట్టాలూ, స్లీపర్లు దెబ్బతిన్నా తొలగించనందునా? అత్యవసర బ్రేకువేస్తే తట్టుకోలేని స్థితిలో పెట్టెలున్నాయా? ఒకప్పుడు వైస్రాయి ఈ కల్కామెయిలులోనే ఢిల్లీ నుండి సిమ్లా వెళ్లేవాడు. రైల్వేలు ప్రతిష్టాత్మకంగా నడిపిన బళ్లలో యిదొకటి. ఇప్పుడు దీనిలో ప్రయాణించిన వారెవ్వరూ దీనిని ప్రతిష్టాకర బండిగా చూడలేరు. ఇంతగా ఎందుకు దిగజారిపోయింది?

గత కొన్నేళ్లుగా రైల్వే ప్రమాదాలు పెరగుతున్నాయి. భద్రతా చర్యలు తీసుకోవటంలో రైల్వేల నిరాసక్తతా, ఆదాయాన్ని పెంచుకునే ఆదుర్దా కలగలిసి ప్రమాదాలకు కారణమౌతున్నాయి. సిగ్నలు పరికరాలను ఆధునీకరించటంలోనూ, రైళ్లు గుద్దుకోకుండా నివారించే పరికరాల ఏర్పాటులోనూ, ఆస్తుల (ఇంజన్లు, పెట్టెలు, పట్టాలు, స్లీపర్లు మొ॥నవి) నిర్వహణలోనూ రైల్వేల అశ్రద్ధా, భద్రతా చర్యల యంత్రాంగం అన్నిస్థాయిల ఉద్యోగాలలో ఏర్పడ్డ ఖాళీలను నింపకపోవటం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తన నివేదికలో ఎత్తి చూపారు. రైల్వేలో వున్న 12 జోన్లలోని అన్ని సెక్షన్లలోనూ భద్రతా సిబ్బంది కొరత ఏర్పడిందనీ, 12 జోన్లలో ఆరింటికి జనరల్ మేనేజర్లనూ, రైల్వేబోర్డులో ట్రాఫిక్ సంబంధ సభ్యుడినీ నియమించకుండా ఖాళీగా వున్నాయనీ కాగ్ నివేదిక పేర్కొంది.

రైల్వేమంత్రి కోర్కెమేరకు రైలుబళ్ల సంఖ్య పెంచుతూపోతున్నారు. దీనికోసం కొత్త ఇంజన్లు, పెట్టెలు కొనుగోలుచేయటంకాక, రెండు స్టేషన్ల మధ్య నడుస్తున్న రైళ్లను పొడిగించటం; మెయింటెనెన్సు కాలాన్ని కుదించివేసి, మరో బండిగా దానినే త్రిప్పటంవల్ల రైళ్ల సంఖ్య పెరిగి, ఆదాయం పెరుగుతుంది. అయితే పెరిగిన సంఖ్యరీత్యా మెయింటెనెన్సు సిబ్బంది పెరగనందునా, పరీక్షాకాలం తగ్గినందునా బండి పరిశీలన తగిన విధంగా వుండటంలేదు. ఒక ప్రయాణంచేసి వచ్చిన రైలుబండి మరో ప్రయాణానికి తగిన విధంగా వుందో లేదో పరిశీలించి, అనుమతినిచ్చేందుకూ తగిన సిబ్బంది లేరు; ఉన్న సిబ్బందికి దానికి తగిన సమయమూ ఉండటంలేదు. డ్రైవరు ఎందుకు బ్రేకు వేశాడన్నది అలా వుంచితే, బ్రేకు వెయ్యగానే కల్కామెయిలు పల్టీకొట్టిందంటే అది ప్రయాణార్హత కలిగిలేదని అర్థమౌతుంది.

ప్రైవేటీకరణ పేరుతో పట్టాలు, స్లీపర్ల సరఫరాను ప్రైవేటు కంపెనీలకిచ్చి నేతలూ, ఉన్నతాధికారులూ అక్రమార్జనలకు పాల్పడినందువల్ల నాణ్యత కొరవడుతున్నది. నాణ్యతలేని ఈ పట్టాలూ స్లీపర్లూ విరిగిపోయి ప్రమాదాలకు కారణమౌతున్నాయి. విరిగిన పట్టాను గమనించి లైన్‌మెన్ చాకచక్యంతో వస్తున్న రైలును ఆపి ఘోరప్రమాదాన్ని నివారించినందుకు అభినందనలు చూసి ఆనందించాలో లేక ఇంత తరచుగా పట్టాలెందుకు విరుగుతున్నాయన్న ప్రశ్నను అభినందనలమాటున దాటవేస్తున్నందుకు ఆగ్రహించాలో తెల్చుకోలేని స్థితి.

కొందరు నిపుణులూ, కొన్ని సంపాదకీయాలూ సూచించినట్లు రైల్వేలను ప్రైవేటీకరించటమో, జోన్లను స్వతంత్ర సంస్థలుగాచేసి పోటీని నెలకొల్పటమో, పట్టాలు నిర్వహణకు ఒకటీ, రైళ్ల నిర్వహణకు ఒకటి, సిగ్నలింగ్ వ్యవస్థకు ఒకటిగా రైల్వేలు వివిధ కంపెనీలుగా విడగొట్టడమో దీనికి పరిష్కారంకాదు.

(తరువాయి 2వ పేజీలో)

**అమరుడు...** (మొదటి పేజీ తరువాయి)

దేశం నుండి నిరంతరాయంగా సంపద తరలింపబడి పోవటానికి రాచబాట వేసి దేశంలోని సహజ వనరులను నిరవధికంగా కొల్లగొట్టుకు పోవటానికీ, దేశంలోని శ్రామికుల శ్రమశక్తిని నిర్దాక్షిణ్యంగా దోచుకుపోవటానికీ మార్గం చేయబడింది.

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి హెచ్చరించినట్లు, అప్పటినుండి దేశంలో అమలు జరపవల్సిన ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలను నిర్ణయించే అధికారం, పెత్తనాలూ సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడి ఆధిపత్యానికి కట్టబెట్టబడింది.

దేశంలో ఎటువంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలో, ఎటువంటి పరిశ్రమలు పెట్టాలో, ఎటువంటి సామాజిక సంక్షేమ పథకాలు అమలు జరుపాలో, ఎక్కడ రోడ్లువెయ్యాలో, ఎక్కడ విద్యుత్తు యివ్వాలో, దేశంలో ఎటువంటి విద్యాబోధన చెయ్యాలో, ఎటువంటి రవాణాని ఏర్పాటు చేయాలో, ఎటువంటి ఆరోగ్యవ్యవస్థను ఏర్పాటు చెయ్యాలో, పౌర పాలన ఏ విధంగా సాగాలో, ఎటువంటి విద్య గరపాలో, ఆఖరుకు ప్రజలు ఎటువంటి నీరు త్రాగాలో అన్న విషయాలకు సంబంధించిన సర్వాధికారాన్నీ, సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడి చేజిక్కించుకొంది. తాను ఆడమన్నట్లు ఆడాల్సిన, చెప్పినట్లు వినాల్సిన సామంతులుగా భారత పాలకులు (ప్రభుత్వాలూ) కుదింపబడ్డారు.

సహజంగానే సామ్రాజ్యవాద ప్రయోజనాలనూ, అవుసరాలను ఈడేర్చే వనరుగా, సామంత రాజ్యం తరహాగా భారతదేశం కుదింపబడింది.

సామ్రాజ్యవాద పెట్టుబడికి సూపర్ లాభాలు గడించి పెట్టే పరిశ్రమలే భారతదేశంలో నెలకొల్పబడ్డాయి. సామ్రాజ్యవాద దేశాలు తయారు చేసిన యంత్రాలను కొనుగోలు చేసే పరిశ్రమలే దేశంలో నెలకొల్పబడ్డాయి. సామ్రాజ్యవాద పెట్టుబడి కారుచౌకగా శ్రామికశక్తి కొల్లగొట్టుకు పోవటానికి వీలైన వాతావరణం దేశంలో కల్పింపబడింది. దేశ ప్రజల, దేశ స్వయం ప్రతిపత్తితో, స్వంతకాళ్ళపై నిలదొక్కుకోవటానికి అవుసరమైన పరిశ్రమలు కాక, సామ్రాజ్యవాద పెట్టుబడి ప్రయోజనాలను పెంపొందించే, సామ్రాజ్యవాదానికి పూర్తిగా పరాధీనం చేసే పరిశ్రమలే నెలకొల్పబడ్డాయి. దేశంలోని అన్ని ప్రజా జీవనరంగాలలోకీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అధికారంకంగానే చొరబడి దేశం యొక్క ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థను కైవసం చేసుకొని దేశప్రజల మూలుగులను పీల్చుకుతింటోంది. ఆఖరికి దేశ రక్షణ వ్యవస్థలో సహితం విదేశీ ప్రవేటు పెట్టుబడి ప్రవేశానికి పూర్తిగా అవకాశం కల్పింపబడి, దేశ రక్షణ కూడా పూర్తిగా పరాధీనమయిపోయింది. సామ్రాజ్యవాద పెట్టుబడి అవుసరాలను నెరవేర్చటానికి, వారి అణువ్యాపారం దేశానికి అవుసరం లేకపోయినా, వినాశకరమైనదైనా అణువిద్యుత్ ఉత్పాదన పేరిట అణుముప్పును దేశ ప్రజలపై బలవంతంగా రుద్దటం జరిగింది. మౌలిక సదుపాయాల ఏర్పాటు పేరిట, సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడి దేశం నుండి చురుగ్గా సంపద తరలించుకు పోవటంకోసం, దేశం నుండీ తన వర్తకపు సరుకులు నింపటం కోసం భారీ ఎత్తు రేవులూ, రోడ్లూ, భవనాల నిర్మాణం చేపట్టబడింది. ఈ కార్యకలాపాలన్నింటినిలో విదేశీ ఉత్పత్తులైన భారీయంత్రాలు వాడబడి, ఆ రకంగా వాటిని ఉత్పత్తి చేసే విదేశీ కంపెనీలకు మార్కెట్టుగా భారతదేశం రూపొందింపబడింది. ఆఖరుకు శుద్ధిచేసిన నీటి పేరిట, సక్రమ జల వినియోగం పేరిటా త్రాగునీరును విదేశీ ప్రవేటు కంపెనీలే, తమ దేశంలో తయారైన యంత్రాల ద్వారా ఉత్పత్తి చేసి అమ్ముకోవటానికి దేశాన్ని, ప్రత్యేకించి దేశంలోని గ్రామీణ ప్రాంతాన్నీ మార్కెట్టుగా మలచటం జరిగింది. విదేశీ పెట్టుబడి యొక్క దోపిడీ యథేచ్ఛగా సాగటం కోసం ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరిట, విదేశీ పెట్టుబడిపాలన జరిపే సెజ్‌లను ఏర్పాటు చేయటం జరిగింది.

మన కృష్ణా-గోదావరి బేసిన్‌లోగల అపార సహజవాయువు చమురు క్షేత్రాలను భారత దళారీ పెట్టుబడిదారీ కంపెనీ అయిన రిలయన్సు ద్వారా విదేశీ ప్రవేటు పెట్టుబడి కంపెనీలయిన బ్రిటీష్ పెట్రోలియం, కెయిర్న్, వేదాంతా కంపెనీలకు కారు చౌకగా ధారాదత్తం చేసి, మనకు సహజసంపదపై అధికారం లేకుండా హక్కు లేకుండా పరాయి వారిని చేసిన అనుభవం మనం చూస్తూనేవున్నాం.

దేశానికి జీవగఱ్ఱ అయిన వ్యవసాయరంగాన్ని ఈ 20 సంత్సరాలుగా ఒక పథకం ప్రకారం నిర్వీర్యం చేయటం జరిగింది. సామ్రాజ్యవాద పెట్టుబడి వ్యవసాయరంగంలోకి ప్రవేశించటానికి పలు మార్గాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ రోజు విదేశీ పెట్టుబడి విత్తనాల రంగంలోకి ప్రవేశించి ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తోంది. అగ్రీబిజినెస్ రంగంలోకి పలురూపాలలో ప్రవేశించి వ్యవసాయ రంగాన్ని మార్కెట్టు శక్తులు శాసించి, నడిపించే స్థాయికి చేరుకొంది. ఎరువుల-పురుగు మందుల రంగం పూర్తిగా విదేశీ పెట్టుబడి నియంత్రణ క్రిందికే చెందింది. ఆఖరుకు ఎరువులపై యిస్తున్నామంటున్న సబ్సిడీనికూడా ఆ విదేశీ పెట్టుబడితో నెలకొల్పబడిన కంపెనీలే కబళించాయి, కబళిస్తున్నాయి. వ్యవసాయ భూములను సెజ్‌లను పేరిట విదేశీ పెట్టుబడికి అన్యాక్రాంతం చేస్తున్నారు. వ్యవసాయం అంటే గిట్టుబాటుకాని, అనవసరమైన వృధాశ్రమ అన్నట్టుగా రైతాంగాన్ని విదేశీ పెట్టుబడీ-మార్కెట్టు శక్తులూ భయపెట్టి, ఒక నిస్పృహ, నిరాశల్లోకి నెట్టాయి.

దేశంలో పంటలు పుష్కలంగా వున్నా, మార్కెట్టు శక్తుల (విదేశీ పెట్టుబడి సృష్టించిన) ఫలితంగా దేశ ప్రజల నోటికి చేరటల్లేదు. రోజురోజుకూ ఆహారపు ధరలు అనూహ్యంగా పెరగిపోతున్నాయి. ఈ పెరుగుదల సబబే అని విదేశీ పెట్టుబడివర్గాలూ-వారి దళారులైన దేశపాలకులూ సమర్థిస్తున్నారు. ఒక పథకం ప్రకారం దేశ వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాద అగ్రోబిజినెస్‌కూ కార్పొరేట్ వ్యవసాయానికి కట్టబెట్టే ప్రయత్నాలు తీవ్రతర మయ్యాయి.

దేశంలో అనూహ్యపరిమాణంలో నిరుద్యోగం పెరిగిపోతూనేవుంది. అయినా దేశంలో నిరుద్యోగం తగ్గిపోతోందనీ, రోజురోజుకీ స్వయం ఉపాధిని చేపట్టే వారి సంఖ్య పెరిగిపోవటమే, దేశ ఆర్థికాభివృద్ధి ఫలాలను దేశ ప్రజలు అనుభవిస్తున్నారనటానికి తార్కాణం అంటూ పాలకులు వితండ వాదనలు చేస్తున్నారు. ఇటీవల జరిపిన ఒక జాతీయ నమూనా సర్వే వివరాలను పాలకులు ప్రకటిస్తూ, దేశంలో 51% మంది స్వయం ఉపాధి చేపట్టారని సర్వేలో తెల్సిందనీ, దీనర్థం ప్రజలలో నిరుద్యోగం తరిగిందనీ, దేశంలో జరిగే ఆర్థిక అభివృద్ధి-ఉపాధిలేని అభివృద్ధి కాదని దీని ద్వారా రుజువైందనీ పాలకులు ఘనంగా ప్రకటిస్తున్నారు. నిజానికి ఈ స్వయం-ఉపాధిని చేపట్టిన వారందరూ ఎటువంటి పనీ దొరకని నిరుద్యోగులు. వీరు బ్రతకటం కోసమని రోడ్ల మీద తిరిగి వస్తువులనూ, కూరగాయలనూ అమ్ముకుంటూ తిరిగే 'హాకర్లు'. ఇళ్ళవద్ద కూర్చొని ఎంతోకొంత సంపాదిద్దామని బీడీలు చుట్టుకుంటూనో, బట్టలు కుట్టుకుంటూనో, చిరుతిండి వ్యాపారాలు చేస్తూనో కాలం వెళ్ళబుచ్చుతున్న నిర్భాగ్య మహిళలు. వీరందరూ నిరుద్యోగులుగా ఖాళీగా కూర్చోలేక బ్రతకటంకోసం 'ఉప్పు అమ్ముకొంటున్న' నిరుపేదలు. కానీ ఈ నిజాన్ని దాచిపెట్టి అబద్ధపు ప్రచారం చేయటానికి కూడా వెనుకాడని వారు మన పాలకులు. వీరు నిరంతరం విదేశీ పెట్టుబడికి కీర్తిగానం చేసే దళారులు, విదేశీ పెట్టుబడి తొత్తులు.

ఇక దేశంలో పేదరికం అనూహ్యంగా పెరిగిపోతోంది. దేశంలో జరుగుతున్న అబద్ధపు ఆర్థికాభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకోవటానికి గణాంకాలను పాలకులు ఎంతగా తారుమారు చేసి చూపిస్తున్నా, పేదరికానికి ప్రమాణాన్ని ఎంతగా తగ్గిస్తున్నా (పట్టణ ప్రాంతాలు రోజుకు 20/- రూపాయలు, గ్రామీణ ప్రాంతంలో రోజుకు 15/- రూపాయలు కన్నా తక్కువ సంపాదన పేదరికానికి నూతన ప్రమాణమట!) వారి ప్రకారమే దేశంలో 37% మంది, అంటే మూడోవంతుకు మించి నంతమంది, దారిద్రరేఖ దిగివనున్న నిరుపేదలు. ప్రపంచబ్యాంకు యొక్క ప్రమాణమైతే (దారిద్ర్యానికి) రోజుకు 1.25 డాలర్లకన్నా తక్కువ సంపాదన. అంటే రోజుకు 65 రూపాయలకన్నా తక్కువ సంపాదన వున్న వారందరూ నిరుపేదలే. ఈ లెఖ్ఖన చూస్తే దేశంలో నిరుపేదల శాతం 77%కు పోతుంది.

దేశంలో నిరక్షరాశ్యుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. దేశంలో బాలకార్మికుల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోతోంది. ఆఖరుకు దేశంలోని మహిళల శ్రమను సహితం విదేశీ పెట్టుబడులు కారు చౌకగా దోచుకొనే విధానాలు అమలు జరుపబడుతున్నాయి.

ఈ రకంగా అధికార మార్పిడి జరిగిన 63 ఏళ్ళ కాలంలో భారతదేశం అన్నిరకాలా అధోగతికి నెట్టివేయబడుతోంది. ఈ తిరోగమన, విషాదకర పరిణామాలకు కారణం సామ్రాజ్యవాద, విదేశీ పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థపై చలాయిస్తున్న ఆధిపత్యమేనన్నది నిస్సందేహం. సరిగ్గా ఈ ప్రమాదకర, వినాశకర పరిణామాలు-విదేశీ ప్రవేటు, ప్రత్యక్ష పెట్టుబడివలన - సంభవించ బోతున్నాయని నాడే హెచ్చరిక చేశారు, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి. ఆయన అసలైన దేశ భక్తుడు కావటం వల్లనే, దేశప్రజలను అమితంగా ప్రేమించటం వల్లనే దేశ పరిస్థితులను అంత విస్పష్టంగా విశ్లేషించి, హెచ్చరిక చేయగలిగారన్నది సుస్పష్టం.

అందుకే ఆయన దేశంలో ఒక ప్రజాతంత్ర సమాజాన్ని స్థాపించగలిగే, నూతన ప్రజాతంత్ర విప్లవ మార్గాన్ని ఎంచుకొన్నారు. ప్రధానంగా విదేశీ సామ్రాజ్యవాదశక్తులనూ, దేశీయ ఫ్యూడల్ శక్తులనూ కూలద్రోసి, స్వతంత్ర, ప్రజాతంత్ర రాజ్యాన్ని స్థాపించే, వ్యవసాయ విప్లవం యిరుసుగాగల జనతా ప్రజాతంత్ర విప్లవాన్ని దేశంలో సాగించటానికి పూనుకొన్నారు. అందుకు నేతృత్వం వహించారు.

ఆయన ఎంచుకొన్న ఈ మార్గం, ఆయన చూపిన ఈ బాట ద్వారానే దేశంలో నిజమైన స్వాతంత్రం, ప్రజాస్వామ్యం నెలకొల్పబడతాయనీ, దేశంలో నిరుద్యోగం, పేదరికం, ఆకలి, అసమానత్వాలు అంతమవుతాయన్నది నిస్సందేహం. అయితే ఆయన చేపట్టిన ఈ కర్తవ్యాన్ని నెరవేర్చి పరిపూర్తి చేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టు విప్లవకారులదే! ఆయన ఆశయాలను ముందుకుగొనిపోవాల్సిన బాధ్యత కమ్యూనిస్టు విప్లవకారులదే!!

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 35వ వర్ధంతి సందర్భంగా ఆయన చూపిన బాటలో పయనిస్తామనీ, ఆయన ఆశయాలను తుదికంటా ధృఢదీక్షతో తీసుకుపోతామని ప్రతిజ్ఞ చేద్దాం!!!

**కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి జోహార్!**

**కామ్రేడ్ టి.ఎన్. ఆశయాలనుకొనసాగిద్దాం!!** ✤

# పోస్కో ప్రాజెక్టుపై పోరాడుతున్న ఒరిస్సా ప్రజలకు సంఘీభావం తెలుపండి!

**ఒరిస్సాలో** జగత్సింగ్‌పూర్ జిల్లాలోని గోబిందపూర్, గడ్‌కుజంగ, థింకియా, నౌగావ్ ప్రాంతంలో నిర్మించబూనుకున్న పోస్కో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా న్యాయమైన, వీరోచిత పోరాటాన్ని సాగిస్తున్న ఒరిస్సా ప్రజలకు సిపిఐ (ఎం-ఎల్) కేంద్ర కమిటీ తరఫున మా మద్దతునూ, సంఘీభావాన్నీ తెలుపుతున్నాము. ప్రజల నిరసనోద్యమాన్ని పాశవికంగా అణచివేసే ఒరిస్సా ప్రభుత్వ ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నాము.

దక్షిణ కొరియాలో వున్న అమెరికా బడా ఉక్కు కంపెనీ పోస్కోతో, ప్రజాభీష్టాన్ని పట్టించుకోకుండా 2005 జూన్‌లో ఒరిస్సా ప్రభుత్వం అవగాహనా ఒప్పందాన్ని చేసుకుంది. దాని ప్రకారం, ఒరిస్సాలో వున్న ఇనుప ఖనిజం వనరులను దోచుకుని లాభాలార్జించేందుకు రూ॥ 54 వేల కోట్లను పెట్టుబడి పెట్టేందుకు పోస్కో ప్రతిపాదించింది. స్వంతరేవునూ, విద్యుత్తు కర్మాగారాన్ని, కార్యాలయాలు, గృహసముదాయాన్ని నిర్మించుకునేందుకు అనుమతించారు. దీనికవసరమైన 4000 ఎకరాలనూ, నీటినీ, ఇతర సౌకర్యాలను అందజేసేందుకు ఒరిస్సా ప్రభుత్వం అంగీకరించింది.

ఒరిస్సా ప్రజలు, ప్రత్యేకించి ఉక్కు కర్మాగారం నిర్మించే ప్రాంత గ్రామాల ప్రజలు దీనిని మొదటి నుండీ వ్యతిరేకిస్తున్నారు. వారి సారవంత భూములను, తమలపాకు తోటలను, జీవనాధారాలను ప్రాజెక్టు నాశనం చేస్తుందని, తమను నిర్వాసితులను చేస్తుందనీ, సహజవనరులను దోచుకుంటుందనీ, ఈ ప్రాంత పర్యావరణాన్ని దెబ్బతీస్తుందనీ వారు వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారు.

పోస్కో ప్రాజెక్టు నిర్మాణం సాగించేందుకు, ప్రజానిరసన ఉద్యమాన్ని చీల్చేందుకూ, బలహీనపరిచేందుకూ, అణచివేసేందుకూ ఒరిస్సా ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేసింది. ప్రజలపైనా, వారి నాయకత్వంపైనా క్రూర నిర్బంధాన్ని ప్రయోగించింది. వారి భూములనుండి ప్రజలను గెంటి వేయటానికి బలాన్ని చట్ట విరుద్ధంగా ప్రయోగించింది. కాంగ్రెసు నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసగించేందుకు ప్రయత్నించింది. పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ చట్టాలకు వ్యతిరేకంగా పోస్కో నిర్మాణం జరగరాదంటూ కొంత సేపు వ్యతిరేకత ప్రదర్శించింది. చట్టఉల్లంఘనలను కనుగొనేందుకంటూ రెండు కమిటీలను నియమించింది. పోస్కో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆ కమిటీలు చెప్పిన తీవ్ర అభ్యంతరాలను కొట్టివేసింది. అటవీ-పర్యావరణ అనుమతులను మంజూరు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ప్రజలను మోసగించాయి.

కేంద్రప్రభుత్వ మద్దతుతో, ఒరిస్సా ప్రభుత్వం 2011 మే 18న ప్రజల నుండి బలవంతంగా భూమిని స్వాధీనం చేసుకునేందుకు మళ్లీ పూనుకుంది. ఏం చేసైనా భూములు ఆక్రమించమని నిర్దేశించి 20ప్లాటూన్ల సాయుధ పోలీసు దళాలను గ్రామాలపైకి పంపింది. పోలీసు తుపాకులతో ప్రజలను మందగా ఒక చోట చేర్చిన అధికారులు 37 తమలపాకుల తోటలను ధ్వంసం చేసారు. ప్రజలు సహకరించారని చూపెట్టుకునేందుకు సొమ్ము చెల్లించినట్లుగా దొంగనాటకమాడారు. దీనితో ప్రజల ఆగ్రహం పెరిగి, పోస్కో ప్రతిరోధ్ సంగ్రామ్ సమితి నాయకత్వంలో నిరసనోద్యమాన్ని తీవ్రం చేశారు.

స్త్రీలు, పిల్లలు, పురుషులు అందరూ ప్రతిపాదిత పోస్కో ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిర్బంధకాండకు వెరువక నిరసనోద్యమాన్ని నడుపుతున్న తీరునూ, తమలపాకుల తోటలు పునర్నిర్మించుకున్న తీరునూ, వారి పోరాటానికి పెరుగుతున్న మద్దతునూ బలపరుస్తున్నాము. సరళీకరణ, ప్రపంచీకరణ, అభివృద్ధి పేరిట దేశాన్ని దారిద్ర్యంలోకి, వెనుకబాటుతనంలోకి, నిరుద్యోగంలోకి, ఆకలి కోరల్లోకీ నెట్టివేస్తూ మన మానవ, సహజ, ఆర్థిక ద్రవ్య వనరులను దోచుకునేందుకు సామ్రాజ్యవాదులూ, బడాబూర్జువాలూ సాగిస్తున్న ఆర్థిక-ద్రవ్య దురాక్రమణకు వ్యతిరేకంగా ఒరిస్సాలోని ఇతర ప్రాంతాలలోనూ, దేశంలోనూ సాగుతున్న ప్రజా ఉద్యమాలలో భాగంగా పోస్కోకు వ్యతిరేకంగా సాగుతున్న ప్రజాఉద్యమాన్ని చూస్తున్నాము. కనుక ఈ ఉద్యమానికి ప్రతిఒక్కరు మద్దతు తెలపాలి; పటిష్టం చేయాలి.

1. ప్రతిపాదిత పోస్కో నిర్మాణ ప్రాంతం నుండి సాయుధ పోలీసు దళాలను ఉపసంహరించాలి.
2. ప్రజలు, కార్యకర్తలు, నాయకులపై మోపిన కేసులను రద్దు చేయాలి; అన్ని నిర్బంధ చర్యలనూ ఆపివేయాలి. గ్రామాలలో సాధారణ జనజీవనాన్ని పునఃస్థాపించాలి.
3. పోస్కోతో ఒరిస్సా ప్రభుత్వం చేసుకున్న అవగాహనా ఒప్పందాన్ని రద్దు చేయాలి.
4. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాన్ని తక్షణమే ఆపివేయాలని డిమాండు చేస్తున్నాము.

**విప్లవాభినందనలతో...**

**2-7-2011** **కేంద్ర కమిటి**

**సిపిఐ (ఎం-ఎల్)**

**ప్రమాద...** (మొదటి పేజీ తరువాయి)

విద్యుత్తు బోర్డులను విడగొట్టి, జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కాంల ఏర్పాటు ప్రజలపై విద్యుత్తు రేట్ల భారాన్ని పెంచింది. ఈ పరిష్కారాలు కూడా ప్రయాణీకుల పైనా, సరకుల రవాణాపైనా ఖర్చుల భారం పెంచుతాయి తప్ప రైల్వేల భద్రతకు ఎలాంటి హామీనీ ఇవ్వలేవు. లాభార్జన మొదటి వేటుపడేది భద్రతా చర్యలపైనే. పైగా పునాదిరంగ నిర్మాణమైన రైల్వేల్లో పెట్టుబడి మదుపుతో పోలిస్తే లాభాలు తక్కువగానే వుంటాయి.

భారత ఆర్థిక వ్యవస్థకు రక్తనాళాలవంటి రైల్వేలను పునర్వ్యవస్థీకరించాలి. ముడిసరుకుల ఎగుమతి, విదేశాలనుండి దిగుమతిని చేరవేసేదిగా రూపొందించిన రైల్వేల నిర్మాణమే 63 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాతకూడా కొనసాగుతున్నది. ఈనాటికీ రేవు పట్టణాల అనుసంధానమే రైల్వేల కర్తవ్యంగా వుంది. దీనిని ప్రజా అవసరాలు తీర్చే దేశీయ ఉత్పత్తిని దేశం నలుమూలలకూ చేరవేసే ప్రజారవాణా వ్యవస్థగా రూపొందించాలి. దీనితో పాటే భద్రతా చర్యలకు ప్రథమ ప్రాధాన్యమిచ్చి అమలుజరపాలి. రైల్వేలను దిగజార్చి, కార్లు, లారీలు, విమానాల వైపు మరల్చే విధానాన్ని ఆపివేయాలి. విమానాలకంటే హైస్పీడ్ రైళ్లే ఎక్కువ ఉపయోగకరంగా మిగిలిన దేశాలు ప్రయాణిస్తుంటే, పాతబడిపోయిన పట్టాలను కూడా మార్చకుండా, రైల్వే మార్గాలకు కాపలా పర్యవేక్షణా కూడా లేకుండా చేసి ప్రమాదాలను కొని, తెచ్చే వైపుగా ప్రపంచంలోనే అతిపెద్దదైన భారత రైల్వేలను దిగజార్చుతున్న పాలకుల విధానాలను ఎండగట్టాలి. ✤

# భారత ఆఫ్రికా వేదిక — బయటపడ్డ భారత విస్తరణవాద కాంక్షలు

**దాదాపు** పాతికేళ్లక్రితం సౌత్‌కమీషన్ ప్రధాన కార్యదర్శిగా మన్మోహన్‌సింగ్ పనిచేశారు. ఆఫ్రికాలో అందరి మన్ననలు పొందిన, సామ్రాజ్యవాద వ్యతిరేకిగా గుర్తింపు పొందిన టాంజానియా అధ్యక్షుడు జూలియస్ నైరేరీ సౌత్‌కమీషన్‌కు ఛైర్మన్‌గా ఉండేవారు. బహుశా ఆయనతో కలిసి పనిచేసిన ప్రభావం మన్మోహన్‌పై పడివుండవచ్చుననటానికి ఆయన నాయకత్వంలో రూపొందిన సౌత్‌కమీషన్ నివేదిక ఒక సాక్ష్యంగా వుంటుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలనూ, వాటి పరిష్కారానికి ఉత్తరభాగంలోని ధనిక దేశాలు తోడ్పడవలసిన తీరు గురించి ఈ నివేదికలో పేర్కొన్న అంశాలు దీనినే ప్రతిఫలించాయి. కానీ ఈనాటి మన్మోహన్‌సింగ్ ఇందుకు పూర్తి విరుద్ధంగా మారిపోయారు. సామ్రాజ్యవాదం ముందుకుతెస్తున్న నయాఉదారవాద విధానాలను సమర్థించటమేకాక, భారత్‌లో వాటి అమలుకు సారథ్యం వహిస్తున్నారు. వీటినే ఆఫ్రికా దేశాలకు కూడా ఆయన ఒక ఔషధంగా చూపుతున్నారని భారత ఆఫ్రికా వేదిక సమావేశంలో స్పష్టమైంది.

భారత ప్రభుత్వం ఆఫ్రికాఖండంవైపు దృష్టి సారించటం 2006లో మన్మోహన్‌సింగ్ దక్షిణాఫ్రికా పర్యటనతో మొదలైంది. మరుసటి ఏడాది ఇండియా–బ్రెజిల్–దక్షిణాఫ్రికా దేశాధినేతల సమావేశానికి ఆయన హాజరయ్యారు. దీని తర్వాత ఆయన నైజీరియా, దక్షిణాఫ్రికాల్లో పర్యటించారు. అదే ఏడాది నవంబరులో కంపాలో జరిగిన కామన్వెల్త్ సమావేశానికి ఆఫ్రికా వెళ్లారు. 2008 ఢిల్లీలో భారత–ఆఫ్రికా వేదిక మొదటి సమావేశం నిర్వహించారు. దీని ద్వారా భారత్ ఆఫ్రికా దేశాలమధ్య సంబంధాలకు సంస్థాగత రూపమిచ్చే ప్రయత్నం చేశారు. ఈ కాలంలో అనేక ఆఫ్రికా దేశాల నాయకులకు భారత్ ఆతిధ్యమిచ్చింది. దక్షిణాఫ్రికాలో గాంధీ సాగించిన సత్యాగ్రహ వారసత్వాన్ని గుర్తుచేస్తూ, ఆఫ్రికా దేశాలతో భారత సంబంధాలు "పరస్పర లబ్ధికర వ్యూహాత్మక భాగస్వామ్యం"తో ఉండాలనీ, ఉంటాయనీ భారత ప్రభుత్వం చెబుతూ వచ్చింది.

ఈ సమావేశంలో మన్మోహన్‌సింగ్ 500 కోట్ల డాలర్ల సహాయ రుణమిస్తున్నట్లూ, 70 కోట్ల డాలర్లను సంస్థల నిర్మాణానికీ, శిక్షణకూ, మరో 30 కోట్ల డాలర్లను ఇథియోపియా–దిబౌతి రైల్వే లైను నిర్మాణానికీ యిస్తున్నట్లు ప్రకటించాడు. ఆఫ్రికా దేశాలతో వాణిజ్యంలో సుంకాల విధింపును తొలగిస్తానని కూడా చెప్పారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలకు కూడా సిద్ధమేనని చెప్పారు. ఈ ఉదారత్వం వెనుకనున్న ప్రయోజనాలేమిటి?

మౌలిక రంగ నిర్మాణాలలో ఆఫ్రికాకు 9300 కోట్ల డాలర్ల పెట్టుబడులు అవసరమౌతాయని ప్రపంచబ్యాంకు అంచనావేసింది. రేవులు, రైల్వేలు, రోడ్లు, వంతెనల నిర్మాణ రంగాన్ని హస్తగతం చేసుకోవాలని భారత పాలకులు ఆశపడుతున్నారు. ఈ రంగంలో ఆఫ్రికా అవసరాలతో పోల్చినప్పుడు, భారత కంపెనీలనే వాటివద్ద అంత డబ్బులేదు. భారత ప్రభుత్వం వారికి నిధులను అందజేసేందుకు పూనుకుంది.

ప్రభుత్వరంగ సంస్థ ఒఎన్‌జిసి, నైజీరియా, గబన్, ఈజిప్టు చమురు అన్వేషణకు లైసెన్సు పొందింది. ఒఎన్‌జిసి అనుబంధ సంస్థ ఓవిఎల్ సూడాన్‌లో నిర్మించే ఆయిల్ పైపులైనులో 90శాతం వాటాలు పొందింది. భారత రైల్వేల అనుబంధ సంస్థ రైట్స్ సహారా దేశాలలో రైల్వేలైన్ల నిర్మాణం చేస్తున్నది. అలాగే కోల్ ఇండియా మొజాంబిక్‌లో రెండు బొగ్గగనులకు అనుమతిపొందింది. దేశంలో చమురు వెలికితీతకు నిధులు లేవనిచెప్పి, అనేక సంవత్సరాలపాటు ఓఎన్‌జిసి అన్వేషణ జరిపి కనుగొన్న చమురు నిక్షేపాలను విదేశీ కంపెనీల కప్పగించిన భారత ప్రభుత్వం ఆఫ్రికా దేశాలలో చమురు అన్వేషణకు ఓఎన్‌జిసిని పంపింది. అలాగే సూడాన్ దేశాన్ని ఉత్తర, దక్షిణ దేశాలుగా విడగొట్టిన అమెరికా దక్షిణ సూడాన్‌లోని చమురును తరలించటానికి, పైపులైను, రైల్వేలైను నిర్మాణాన్ని భారత రైల్వేలచే నిర్మిస్తున్నది. ఇక్కడ కూడా భారత్‌లో చేపట్టిన కొత్త రైల్వే మార్గాలు నత్తనడకన సాగుతుండగా, సూడాన్‌లో మాత్రం శరవేగంతో సాగుతున్నది. సామ్రాజ్యవాదుల పనుపున భారత పాలకులు తమ సంస్థల నిధులను ఉపయోగిస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదం పట్ల ఆఫ్రికా ప్రజల్లో వున్న తీవ్ర వ్యతిరేకతవల్ల ఆఫ్రికా దేశాధినేతలు మిగిలిన దేశాలవైపు చూస్తున్నారు. చైనా ఇప్పటికే ఆఫ్రికాలో 12700 కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టింది. చైనాకు పోటీగా భారత్‌ను అమెరికా ముందుకునెట్టి తన ప్రయోజనాలను నెరవేర్చుకోజూస్తున్నది. భారత పాలకులు దానికి తోడ్పడుతున్నారు.

ఇటీవలి కాలంలో ఆఫ్రికా దేశాలలోని సారవంతమైన భూములను బహుళజాతి కంపెనీలు ఆక్రమించుకుంటున్నాయి. అక్కడ పంటల సాగును తమ ఆధిపత్యంలోకి తెచ్చుకుని ఆహారంపై ప్రపంచాధిపత్యం పొందాలని చూస్తున్నాయి. ఇన్నాళ్ళు చీకటి ఖండమన్న ఆఫ్రికా గర్భంలో దాగివున్న ఖనిజ నిక్షేపాలను కూడా తరలించుకుపోతున్నాయి. ఇది సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రపోటీకి, సాయుధ ఘర్షణకూ కూడా దారితీస్తున్నది.

చైనాతో పోటీపడి భారత పెట్టుబడిదారులకు నూతన అవకాశాలు కల్పించటమే మన్మోహన్‌సింగ్ పర్యటన లక్ష్యమని ఆఫ్రికా వ్యవహారాల నిపుణుడు, భారత మాజీ రాయబారి రాజీవ్ భటియా చెప్పాడు. ఆ పెట్టుబడిదారులెవరో చూడండి. భారత ఎయిర్‌టెల్ నైజీరియా, సూడాన్, కెన్యా, టాంజానియా, ఉగాండా, కాంగో, గబన్, మడగాస్కర్ తదితర 16 దేశాలలో టెలికామ్ సర్వీసులను కొనివేసింది. అలాగే ఎస్సార్, రిలయన్స్‌లు కూడా టెలికాం లైసెన్సులు పొందాయి. జిందాల్, టాటా, స్టెరిలైట్, వీడియోకాన్‌లు బొగ్గు గనులను నమీబియా, మొజాంబిక్, దక్షిణాఫ్రికాల్లో పొందాయి. మెడగాస్కర్‌లో సున్నపురాయి గనులను జిందాల్ పొందింది. ఎస్సార్ ఎనర్జీ కెన్యాలోని ఆయిల్ రిఫైనరీలో 50శాతం వాటాలు కొనివేసింది. మందుల కంపెనీలు రాన్‌బాక్సీ, లూపిన్ దక్షిణాఫ్రికాలోకి ప్రవేశించాయి. ఇవికాక గోద్రేజ్, దాబర్, మహేంద్ర, టాటా మోటార్స్, మారుతీ, బజాజ్, మారికో(బిస్కెట్స్) కంపెనీలు కూడా ఆఫ్రికా దేశాలతో వాణిజ్యం చేస్తున్నాయి.

పైన పేర్కొన్న కంపెనీలలో ఎక్కువ భాగం భారత్‌లోవున్న పూర్తి విదేశీ కంపెనీలు, మిగిలినవి మిలాఖత్ కంపెనీలు. అంటే ఆఫ్రికా దేశాలను దోచుకోవటానికి భారత్‌ను మధ్యదొంతరగా సామ్రాజ్యవాద కంపెనీలు వాడుకుంటున్నాయి. భారత దళారీ పాలకులు దీనికే పూనుకున్నారు.

దీనిని కప్పిపుచ్చుకునేందుకు ఆఫ్రికాలో భారత్, చైనాలమధ్య పోటీ నానాటికీ పెరుగుతున్నట్లుగానూ, చైనాకు దీటుగా నిలవాలంటే భారత్ తన కార్యకలాపాలను విస్తరించాలని సామ్రాజ్యవాదులు ప్రచారం చేస్తున్నారు. భారత్ తన కార్యకలాపాలను అభివృద్ధి సహాయం అని పిలువరాదనీ, దక్షిణ దేశాలమధ్య సహకారమని పిలవాలనీ సూచిస్తున్నాయి. (అంతర్జాతీయ వ్యవహార విధానాల బ్రిటన్ సంస్థ ఛాథామ్ హౌస్ నివేదిక) (వాల్ స్ట్రీట్ జర్నల్ 26-5-2011 నుండి ఉల్లేఖన). ఈ నివేదిక భారత పత్రికల్లోరాని మరో విషయాన్ని కూడా పేర్కొంది. 33 ఆఫ్రికా దేశాలలో ఈ–నెట్‌వర్క్ నిర్మాణానికి భారత్ 12 కోట్లడాలర్లు వెచ్చిస్తున్నది. ఇది ఆఫ్రికా దేశాలలోని ఆస్పత్రులూ, స్కూళ్లనూ భారత్‌తో అనుసంధానిస్తుంది. వైద్యసేవలకోసం ఆఫ్రికా దేశాలనుండి భారత్‌కు రావటం పెరిగినందున అపోలో వంటి కార్పోరేటు ఆస్పత్రులు ఆఫ్రికా దేశాలలోకి విస్తరించేందుకు యిది తోడ్పడుతుందని ఆ నివేదిక పేర్కొంది. ఇప్పటికే నైజీరియాలో భారత కార్పోరేటు ఆస్పత్రుల శాఖల ఏర్పాటుకు అవకాశాలు ఏర్పడ్డాయని కూడా పేర్కొంది. అమెరికాలో భారత్‌నుండి వలసవచ్చినవారు అమెరికా ఇండియా రాజకీయ కార్యాచరణ కమిటీగా ఏర్పడి అమెరికా–భారత్ సంబంధాలను బలీయంచేస్తున్న రీతిలోనే ఆఫ్రికాలోని భారత్‌నుండి వలసవచ్చినవారితో ఇలాంటి కమిటీని ఏర్పాటుచెయ్యాలని కూడా సూచించింది. చివరిగా భారత విదేశాంగ మంత్రిత్వశాఖలో 700మంది ఉద్యోగులు మాత్రమే వున్నారనీ, వీరి సంఖ్యను గణనీయంగా పెంచకుండా ఈ కార్యకలాపాలు సాగించటం కష్టమని కూడా వ్యాఖ్యానించింది.

ఆఫ్రికా దేశాలతో భారత్ సంబంధాలను సామ్రాజ్యవాద దేశాలు ఎలా నిర్దేశిస్తున్నాయో ఈ నివేదిక తెలుపుతున్నది. సామ్రాజ్యవాదుల జూనియర్ భాగస్వామిగా ఆఫ్రికా దేశాలపై సామ్రాజ్యవాద ఆధిపత్యానికి తోడ్పడి ఆ పరిధిలో తన విస్తరణవాద కాంక్షలను ఈడేర్చుకోవాలన్న భారత బడాబూర్జువావర్గ ఆశలకు మన్మోహన్‌సింగ్ ఆఫ్రికా పర్యటన అద్దం పడుతున్నది. ✤

# గ్రీసు — సంక్షోభాన్ని తీవ్రం చేసిన ఐ.ఎం.ఎఫ్–ఇ.యు.

**గత** ఏడాది మే నెలలో, తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయిన గ్రీసుకు 11 వేల కోట్ల యూరోలను సహాయంగా యూరోపియన్ యూనియన్ (ఇయూ) అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్)లు అందించాయి. 2013 వరకూ గ్రీసు రుణ అవసరాలను ఇది తీరుస్తుందని చెప్పారు. ఆర్థిక జబ్బును "నయంచేసి", "నూతన వృద్ధి"ని తెస్తుందన్న వాగ్దానంతో తీవ్ర పొదుపు చర్యలను అమలు చెయ్యమని ఇవి గ్రీసును ఆదేశించాయి. అయినప్పటికీ, సూటిగా చెప్పాలంటే రుణం కారణంగా, గ్రీసు మరింత తీవ్ర సంక్షోభంలో పడింది.

ఏడాది క్రితం గ్రీసు ఆర్థిక ఉత్పత్తి 4.5 శాతానికి పడిపోయింది. దేశరుణం స్థూల జాతీయ ఉత్పత్తిలో 142 శాతంగా వుంది. 65 వేల వ్యాపార సంస్థలు దివాళా తీసాయి. 2 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. గ్రామసీమల స్థితి ఇంతకంటే ఘోరంగా వుంది.

ప్రధాని పపాండు, ప్రభుత్వ వ్యయంలో తీవ్రంగా కోత విధించాడు. ప్రభుత్వ రంగ సంస్థలలో వేతనాలను 30 శాతం తగ్గించాడు. అధికారికంగా నిరుద్యోగం 15 శాతం, యువతలో నిరుద్యోగం 30 శాతంగా వుంది. ప్రభుత్వ రెవిన్యూ ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. 2011 మొదటి నాలుగు నెలల్లో 130 కోట్ల యూరోల రెవిన్యూ తగ్గింది. గంజి కేంద్రాల వద్ద బారులు తీరే పౌరుల సంఖ్య పెరిగింది.

అదే సమయంలో బడా కంపెనీల, వాటి అధిపతుల ఆదాయాలు ఆర్థిక మాంద్యత ఏర్పడిన 2008 నాటికి తిరిగి చేరి ఆకాశాన్నంటాయి. సహాయ రుణంలో సగాన్ని ఇప్పటికే ఖర్చు చేశారు. దీనివల్ల దేశ రుణంలో ప్రైవేటు మదుపుదారుల వాటా 30 వేల కోట్ల నుండి 18 వేలకోట్ల యూరోలకు తగ్గింది. కాగా దీనిలో ప్రభుత్వ రుణం సగానికి పైగా వుంది. ఈ ఉద్దీపనా పథకమనేది ప్రైవేటు బ్యాంకులను రక్షించే పథకంగా తయారైంది. యూనిక్రెడెట్ అన్న బ్యాంకు అధిపతి ఆండ్రియాస్ రీస్ "భారమంతా ప్రైవేటు నుండి పబ్లిక్ నిధులపైకి పెద్దయెత్తున మరల్చబడింద"ని అన్నాడు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంకు అధ్యక్షుడు జీన్‌క్లాడ్ త్రిషే "రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత, బహుశా మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత అత్యంత క్లిష్ట పరిస్థితి ఈనాడు ఏర్పడింద"న్నాడు.

గ్రీసు ప్రభుత్వం దివాళా తీయగల ప్రమాదం ఇ.యు.లో తీవ్ర విభేధాలకు దారితీసింది. గ్రీసులోని ద్రవ్య గుత్త పెట్టుబడిదారులను రక్షించటానికి అనుసరించాల్సిన పద్ధతిపై యూరోపియన్ దేశాధినేతలు ఘర్షణపడ్డారు. గ్రీసు పాశవిక పొదుపు చర్యలను అమలు జరపాలని జర్మనీ వాదించింది. యురోపులోని సంపన్న దేశాలు, మొదటగా జర్మనీ, సహాయమిచ్చి, దానిని పొదుపు చర్యలతో మేళవించి అమలు చేయాలని ఫ్రాన్సు, బ్రిటను, ఇటలీలు వాదించాయి. ఇక ఇ.యు. ఉనికిని కోల్పోవచ్చునన్న స్థాయిలో విభేధాలు సాగాయి. చివరకు జర్మనీ తనవైఖరి మార్చుకోకపోతే యూరో ఉమ్మడి ద్రవ్య వ్యవస్థ నుండి తప్పుకుంటానని ఫ్రెంచి అధ్యక్షుడు సార్కోజీ బెదిరించిన తర్వాత మాత్రమే ఇయులో ఒక ఏకాభిప్రాయం కుదిరింది. ఈ అంగీకారం ప్రకారం ఐ.ఎం.ఎఫ్., ఇ.యు.లు గ్రీసుకిచ్చే రుణానికి తీవ్ర పొదుపు చర్యల అమలుతోనూ, కాబూలీ వడ్డీరేట్లతోనూ ముడి పెట్టింది.

ఈ సహాయం పేరిట షరతుల రుణాన్ని ఆమోదించమని గ్రీకు పార్లమెంటుపై ఇయు తీవ్ర వత్తిడి చేసింది. షరతుగా విధించిన పొదుపు చర్యల ద్వారా 2015 నాటికి 2800 కోట్ల యూరోలను పొదుపు చేయాలి. అంటే ఆ మేరకు వేతనాలు, పెన్షన్లు, ఇతర సామాజిక సౌకర్యాలలో కోత విధించాలి. ఫలితంగా గ్రీకు ప్రజల జీవన ప్రమాణాలు మరింత దిగజారుతాయి. ఇదికాక మరో 5 వేల కోట్ల యూరోలను ప్రభుత్వరంగ సంస్థలను అమ్మి వేయటం ద్వారా సంపాదించాలి. దీనివల్ల మరో లక్షన్నర మంది ఉద్యోగాలు కోల్పోతారు. ఆరోగ్య, వైద్య, విద్య రంగాలలో సామాజిక వ్యయం తగ్గుతుంది. మధ్యతరగతి ప్రజలపై పన్నుల భారం మరింత పెరుగుతుంది. రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలు చిన్నవిగా వుండటం గ్రీసు ఆర్థిక వ్యవస్థ ప్రత్యేకత. వీటిపై విలువ ఆధారిత పన్ను 13 నుండి 23 శాతానికి పెరుగుతుంది. వీరు దివాళా తీస్తారు. ఫైనాన్షియల్ టైమ్స్ విలేఖరి, పొదుపు చర్యలను గట్టిగా సమర్థించేవాడూ అయిన ఉల్ఫ్‌గాంగ్ ముంచౌ ఈ రుణ సహాయం "ఆర్థికంగా నిర్లక్ష్యం; రాజకీయంగా బాధ్యతారాహిత్యం... ఈ కార్యక్రమాన్ని రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా సమర్థించటం సాధ్యంకాదు" అని తెగేసి చెప్పాడు.

గ్రీకు ప్రజలలో అత్యధికులు ఈ సహాయ రుణాన్ని తిరస్కరించాలని కోరుతున్నారు. రెండు రోజులు సార్వత్రిక సమ్మెతో కార్యకలాపాలను స్థంభింప చేశారు. వేలాది మంది పార్లమెంటు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అయినా బయట నిరసన ప్రదర్శన సాగుతున్నా, అధికార పక్షానికి చెందిన ఒక్క పార్లమెంటు సభ్యుడు తప్ప మిగిలిన అందరూ రుణసహాయాన్ని చట్టం చేస్తూ ఓటు వేశారు.

జూన్ నెలంతా రాజధాని ఏథెన్స్‌లో సింటాగ్మాస్క్వేర్ (రాజ్యాంగ చట్టస్క్వేర్) ప్రజల నిరసనలతో దద్దరిల్లి పోయింది. "మేమెవరికీ అప్పులేము; మేమేదీ అమ్ముకోము; మేమేదీ చెల్లించబోము;" "మమ్ములను మేము అమ్ముకోము", "బిల్లు, రుణం, ప్రభుత్వం–అందరినీ తప్పుకోమనండి"–అని నినదించారు. రోజులు గడుస్తున్న కొద్దీ గ్రీకు సమాజంలోని పేదవర్గాలు పాల్గొనటం పెరిగింది. పబ్లిక్ రుణంపై బహిరంగ పద్దుల తనిఖీ కోరుతూ పిటీషన్‌పై సంతకాలు చేసే వారి సంఖ్య పెరిగింది. అదే సమయంలో జాతీయోన్మాద, అగ్రజాతి దురాహంకార, నయానాజీ ప్రతీపశక్తులు ప్రజల శాంతి, నిరసనలకు నాయకత్వాన్ని చేజిక్కించుకునే ప్రయత్నాలు పెరిగాయి.

ప్రజలలో ప్రతిష్టను గ్రీకు పాలక వర్గాలు, అలాగే యూరపు దేశాల పాలక వర్గాలు కూడా, ప్రజాస్వామిక హక్కులపై దాడిని సాగిస్తున్నాయి. తీవ్ర నిర్బంధాన్ని అమలు జరుపుతున్నాయి. కార్మికులను చీల్చివేసేందుకూ, ప్రస్తుత సంక్షోభంలో తమ పాత్ర నుండి దృష్టి మరల్చేందుకూ పాలకవర్గాలు ప్రజా జీవనంలో జాతీయోన్మాద విషాన్ని కక్కుతున్నాయి. వలస కార్మికులను లక్ష్యం చేసి దాడులు చేస్తూ జాతుల మధ్య వైషమ్యాన్ని రగుల్చుతున్నాయి.

గ్రీసుకు రుణ సహాయ మందించిన ఏడాది తర్వాత, కార్మికవర్గంపై దోపిడీని, దాడినీ తీవ్రం చేసినప్పటికీ ఆర్థిక సంక్షోభాన్ని పరిష్కరించే శక్తి తమకు లేదని యూరపు, సామ్రాజ్యవాదులు బయట పెట్టుకున్నారు. కార్మికవర్గం తనకర్తవ్యాన్ని చేపట్టాలి. నిరసనోద్యమంలో రాజకీయ దశను తీసుకురావాలి–అంటే ప్రస్తుత సంక్షోభాన్ని పెట్టుబడిదారీ విధానపు సామాజిక వ్యవస్థ చట్రపు పరిధిలో పరిష్కరించటం అసాధ్యమనీ, సోషలిజం దీనికి ప్రత్యామ్నాయమని చూపుతూ విప్లవ కార్యక్రమాన్ని గ్రీకు ప్రజల ముదుంచాలి. సోషలిస్టు విప్లవం కొరకు, దానిసాధన కొరకు రాజ్యాధికారాన్ని కైవసం చేసుకొనే పోరాటానికి ప్రజలను సన్నద్ధులను చేయాలి. ✤


వెలువడింది!



వెల: 15/-

అరబ్ దేశాల్లో ప్రజా ఉద్యమాలు-సామ్రాజ్యవాదుల కుట్రలు

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

వెలువడింది!



వెల: 12/-

సామ్రాజ్యవాద కంపెనీల అనైతిక ఔషధ ప్రయోగాలు

కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
28-9-1, జలీల్ వీధి,
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ-2

# ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, ప్రజాతంత్రవాది సింగరాజు శతజయంతి



ఈ సంవత్సరం జూలైకి ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, ప్రజాతంత్రవాది అయిన సింగరాజు రామకృష్ణయ్య జన్మించి, నూరు సంవత్సరాలు నిండాయి. ఉపాధ్యాయ ఉద్యమానికి నాయకత్వం వహించిన తొలితరంలో సింగరాజు ప్రముఖులు. ఉపాధ్యాయ ఉద్యమానికి ప్రత్యేకంగా నాయకత్వం వహించినా ప్రజాస్వామిక, ప్రగతిశీల ఉద్యమాలకు–ముఖ్యంగా విద్యార్థి, యువజన, ప్రజాతంత్ర హక్కుల ఉద్యమాలకు చేదోడువాదోడుగా నిలిచారు.

సింగరాజు పుట్టింది నెల్లూరుజిల్లా తలకొండపాడు గ్రామం. వారి కుటుంబం జాతీయోద్యమంలో పాల్గొన్నది. సింగరాజు ప్రాధమికోపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించినా జాతీయోద్యమ భావాలతో ప్రదీప్తులై, వాటికనుగుణంగా తన జీవన విధానాన్ని మలచుకొని వ్యవహరించారు. ఉపాధ్యాయ వృత్తిలో చేరకముందు విదేశీ వస్తువుల బహిష్కరణ, సారా వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే 1942 క్విట్ఇండియా ఉద్యమంలోనూ భాగస్వాములయ్యారు.

ఆ రోజుల్లో ఉపాధ్యాయుల ఆర్థిక స్థితిగతులు, సర్వీస్ కండిషన్లు చాలా దారుణంగా ఉండేవి. వేతనాలు కడుదయనీయం, ఉద్యోగ భద్రతా లేదు. వీటన్నిటికి తోడు సంఘం పెట్టుకునే హక్కులేదు. ఈ దుర్భర పరిస్థితులను అధిగమించడంకోసం 1939లో మలబారు ఉపాధ్యాయులు సమ్మెచేశారు. బ్రిటిష్ వలస పాలకులు దిగివచ్చి, సంఘం పెట్టుకొనేందుకు ఉత్తర్వులు జారీచేశారు. అయితే వాటిల్లో ఆంక్షలు, పరిమితులు విధించారు. అంటే యాజమాన్యంవారీగా తాలుకా స్థాయిలో ప్రభుత్వం అనుమతితో సంఘం పెట్టుకోవాలి. విభజించు పాలించు అన్న సూత్రాన్ని పాటించి, కంటినీటి తడుపుచర్యగా వ్యవహరించారు. ఇది, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, హక్కులకు అడ్డంకిగా నిలిచింది.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు జారీచేసిన 416 జీవోను ధిక్కరించి, సత్యపుత్రశర్మ, రామజోగారావు, మాణిక్యాంబ 1944లో తూర్పుగోదావరిజిల్లా తాపేశ్వరం గ్రామంలో ప్రథమ ఉపాధ్యాయ విద్యామహాసభను నిర్వహించి, ఆంధ్రరాష్ట్ర ఎలిమెంటరీ టీచర్స్ ఫెడరేషన్ స్థాపించారు. దీనిని వలస పాలకులు సహించలేదు. అణచివేత విధానాలను అవలంబించారు. సంస్థను గుర్తించడానికి నిరాకరించారు. తాము విధించిన ఆంక్షలకు విరుద్ధంగా సంఘాన్ని ఏర్పాటుచేసిన నాయకుల సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకోవడం, ఉద్యోగాలకు ఉద్వాసన చెబుతామని బెదిరించటం జరిగింది. దీనితో సంస్థ కార్యకలాపాలు కొద్దికాలానికే స్థంభించిపోయాయి. అయితే తాపేశ్వరం విద్యామహాసభను రాష్ట్రసంఘం ఏర్పాటుకు అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల ఐక్యతకు నాంది పలికింది.

1947లో చెన్నుపాటి లక్ష్మయ్య నాయకత్వాన రెండవ విద్యామహాసభ గుంటూరులో జరిగింది. తాపేశ్వరంలో స్థాపించబడిన ఆంధ్రరాష్ట్ర ఎలిమెంటరీ టీచర్స్ ఫెడరేషన్ పునరుద్దరింపబడింది. ఇది ఫెడరేషన్ నిర్మాణానికి పునాది వేసింది.

1948లో నెల్లూరుజిల్లా డిఇఓ నిరంకుశ పద్ధతులకు వ్యతిరేకంగా కనిగిరి తాలూకా ఉపాధ్యాయులు చేసిన తిరుగుబాటు సంఘటనతో సింగరాజు రామకృష్ణయ్య ఉద్యమ జీవితం మలుపుతిరిగింది.

నాటి జాతీయోద్యమ నాయకులు గాంధి, బోస్ వంటి వారి ఆదర్శాలు మరియు కమ్యూనిస్టు ఉద్యమం చూపిన ప్రభావాలతో 1949లో టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాధ్యతలను చేపట్టారు. నాటినుండి జీవితాంతం కమ్యూనిస్టు భావాలతోనే, ఉపాధ్యాయ ఉద్యమంలో నిబద్ధతతో పనిచేశారు.

1948–51లలో ఆంధ్రాలో కమ్యూనిస్టు మరియు ప్రగతిశీల ఉద్యమాలపైన పైశాచికమైన దాడులు సాగాయి. తీవ్రమైన నిర్బంధ అణచివేత విధానాలు అమలయ్యాయి. వీటికి టీచర్స్ ఫెడరేషన్ మినహాయింపుగా లేదు. ఎంతోమంది ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను సస్పెండ్చేయడం, ముఖ్యమైన నాయకులను, కార్యకర్తలను ఉద్యోగాలనుండి తొలగించడం, డిటెన్యూలుగా నిర్బంధించడం, ఎన్కౌంటర్చేయడం వంటి చర్యలకు పాల్పడటం జరిగింది.

మరోవైపున వలస పాలకులు జారీచేసిన అప్రజాస్వామిక ఉత్తర్వులను అడ్డంపెట్టుకొని నెల్లూరుజిల్లా బోర్డు యాజమాన్యం సింగరాజు, మరికొందరిపైన కక్షసాధింపు చర్యలకు దిగింది.

వీటన్నింటిని ఫెడరేషన్ నాయకత్వం చెన్నుపాటి లక్ష్మయ్య, సింగరాజులు చర్చించి మద్రాస్ హైకోర్టులో 1950లో సవాల్ చేశారు. సంఘం పెట్టుకొనే హక్కు, అందులో పనిచేయడంకోసం ప్రభుత్వ అనుమతి అవసరం లేదని హైకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించింది. ఇది, ఫెడరేషన్ ముందుకు సాగడానికి ఉత్తేజం కలిగించింది. ప్రభుత్వం అమలుచేసిన అణచివేత, నిర్బంధ చర్యలపైన ప్రాతినిధ్యాలు, ఆందోళనలకు నాయకత్వం సాగించి, సంఘాన్ని ధైర్యంగా నిలబెట్టింది. 1953లో సంస్థ గడించిన అనుభవాలను నాయకత్వం క్రోడీకరించి, ఒక విధానపత్రాన్ని రూపొందించింది. ఇది, విద్యారంగం, ఉపాధ్యాయుల ప్రయోజనాలకోసం విశాల ప్రాతిపదికను కల్పించింది. అంటే విభిన్న రాజకీయాభిప్రాయాలు, సాంఘిక–మత విశ్వాసాలు కల్గివున్నా, సమిష్టిగా పనిచేయడానికి అవకాశం కల్పించింది. సామాజిక మౌలిక మార్పులను ఆకాంక్షించింది. ప్రజాతంత్ర విద్యావిధానంకోసం కృషి చేయాలన్నది. ఈ లక్ష్యాలను విస్మరించిన కొంతమంది తమ పాక్షిక రాజకీయ ప్రయోజనాలకోసం, సంస్థ నిర్మాణ ఉద్యమ ఐక్యతకు విరుద్ధంగా వ్యవహరించి, చీలికలు తీసుకువచ్చారు. ఇన్ని ఆటుపోటులను తట్టుకొని, సూత్రబద్ధ వైఖరితో వ్యవహరించిన సింగరాజు నాయకత్వం లక్ష్యాల కనుగుణంగా సంస్థను నడిపించింది, పురోగమింప చేసింది.

1952 నుండి సింగరాజు శాసనమండలికి నాల్గు పర్యాయాలు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూనే మరోవైపు ప్రజాస్వామిక సెక్షన్ల సమస్యలను శాసనమండలిలో శక్తివంతంగా విన్పించారు.

ఉపాధ్యాయుల సమస్యలకోసం ఆందోళనలు, సమ్మెకార్యక్రమాలు సాగించటమేగాక, ఉద్యమంలో వచ్చిన చీలికలను పరిగణించిన సింగరాజు, ఫ్యాప్టోవంటి ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదికలను ఏర్పాటు చేయడం, వాటికి నాయకత్వం వహించి, అవిరళ కృషిచేయడం, ఎన్నో సౌలభ్యాలను సాధించడం జరిగింది.

పెరిగిన ధరల కనుగుణంగా ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి వేతనాల సవరణకు, డి.ఏ పెంపుదలకు పెన్షనరీ సదుపాయాలు సాధనకు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలతో ఏర్పాటు చేసిన ఐక్యకార్యాచరణ సమితులైన జెసిఇ, జెఏసి వంటి వాటిల్లో సారధ్యసంఘ సభ్యులుగా వుండి పలు విజయాలు సాధించడంలో ముఖ్యమైన పాత్ర వహించారు.

జాతీయ, అంతర్జాతీయ ఉపాధ్యాయ సంఘాలతో సింగరాజు సంబంధాలు పెట్టుకోవడం జరిగింది. తొలుత జాతీయ స్థాయిలో అఖిలభారత ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్లో టీచర్స్ ఫెడరేషన్ అనుబంధం పొంది, నాయకత్వ కమిటీలో సింగరాజు కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత అఖిలభారత విద్యాసంస్థల సమాఖ్యకు కార్యదర్శిగా, ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. దేశవ్యాపితంగా ఒకేరకమైన స్కేళ్ళు–పెన్షనరీ సదుపాయాలకోసం మరియు వివిధ విద్యాకమీషన్లు చేసిన సిఫార్సుల అమలుకోసం కృషిచేశారు.

రెండవ ప్రపంచయుద్ధానంతరం 1946లో సోవియట్ యూనియన్ ఉపాధ్యాయ సంఘం నాయకత్వాన ప్రపంచ ఉపాధ్యాయ సమాఖ్య ఏర్పడింది. అందులో టీచర్స్ ఫెడరేషన్ 1951లో అనుబంధం పొందినది. దాని ఆశయాలకోసం మూడు దశాబ్దాలపాటు పనిచేసింది. దాని ఆధ్వర్యంలో వెలువరించిన 'టీచర్స్ ఆఫ్ ది వరల్డ్' పత్రికకు సింగరాజు రిపోర్టర్గా పనిచేశారు.

రాష్ట్రస్థాయి నుండి జాతీయ, అంతర్జాతీయ ఉపాధ్యాయ ఉద్యమంలో సింగరాజు నిర్వహించిన నాయకత్వపాత్ర, సాగించిన నిరంతర కృషి నేటి తరం ఉపాధ్యాయులకు ఎంతో ఆదర్శనీయం.

రెండు దశాబ్దాలక్రితం భారత పాలకులు, పాలకవర్గాలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అవలంబిస్తున్నాయి. విద్యారంగంతో సహా వివిధ రంగాలను ప్రయివేటీకరిస్తున్నాయి. సామాజిక సదుపాయాలైన విద్య, వైద్యం వంటి వాటిని పేద, బలహీన వర్గాలకు అందుబాటులో లేకుండా చేస్తున్నాయి. నేటి వ్యవస్థలో వేతన విధానం, ఎనిమిది గంటల పనిపద్ధతి, సెలవు, సర్వీస్ నియమాలు, బోనస్, పెన్షనరీ సదుపాయాలు ఎంతో కొంత మెరుగైనవే. వీటిని, అంతర్జాతీయంగా, దేశీయంగా సాగించిన సమరశీల పోరాటాలద్వారా సాధించుకోవడం జరిగింది. వీటి స్థానంలో కాంట్రాక్టు వేతన విధానం, అవుట్ సోర్సింగ్ విధానాలను అమలుచేస్తున్నాయి. ఎనిమిది గంటల పనిపద్ధతిని ఎత్తివేసి, పనిగంటలు పెంచేందుకు, శ్రమశక్తిని మరింతగా దోపిడీ చేసేందుకు కొన్ని రాష్ట్రాలు చట్టాలను సవరించుతున్నాయి. మరికొన్ని అందుకు సన్నాహాలు చేస్తున్నాయి. పర్యవసానంగా సెలవు, సర్వీస్ నియమాలు, బోనస్, పెన్షనరీ సదుపాయాలు, టైంస్కేలు వంటి వాటిని కోల్పోవలసిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మరికొన్ని సౌలభ్యాలను కుదించివేయడం జరుగుతోంది.

ప్రభుత్వ విద్యావ్యవస్థను బలహీనపరచి, ప్రయివేట్ విద్యను విస్తరింపచేయడానికి, అందుకు చట్టబద్ధతను కల్పించడానికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే 40–50 శాతం వరకు విద్యాసంస్థలు ప్రయివేట్ రంగంలోనే నడుస్తున్నాయి. ఈ విధానాలు, దేశీయ అవసరాలకు, మాతృభాషలకు దారుణంగా హానికల్గిస్తున్నాయి. అంతేగాక కార్మిక, ఉద్యోగ,ఉపాధ్యాయవర్గాల సంక్షేమాన్నీ దెబ్బతీస్తున్నాయి.

అందువలన ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత, ప్రజాతంత్రవాది అయిన సింగరాజు రామకృష్ణయ్యవంటి నాయకులు ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో నెలకొల్పిన ప్రమాణాలను, ఆదర్శాలను, నైతిక విలువలను, సామాజిక వ్యవస్థలో తీసుకురావాల్సిన మౌలిక మార్పులకోసం సాగించిన కృషిని కొనసాగించ దానికి ఉద్యోగ ఉపాధ్యాయవర్గాల బాహుళ్యం నిబద్ధతతో నిలబడి సమరశీలంగా పనిచేయడం సింగరాజు శతజయంతి కర్తవ్యం కావాలి! ✤

# విజయవాడలో విజయవంతంగా జరిగిన సింగరాజు శతజయంతి సభ



సదస్సులో ప్రసంగిస్తున్న ఏ.బి.కె.ప్రసాద్

**విజయవాడ, 3–7–11:**

**ఆంధ్రప్రదేశ్లో** ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతలలో ఒకరు, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్కు సుదీర్ఘకాలం రాష్ట్రప్రధాన కార్యదర్శిగా చేసిన సింగరాజు రామకృష్ణయ్య శతజయంతి సభను ఏపిటియఫ్ విజయవాడలో నిర్వహించింది. స్థానిక సిద్దార్థ అకాడెమీ ఆడిటోరియంలో జరిగిన ఈ సభకు రాష్ట్ర అధ్యక్షులు కె.వేణుగోపాల్ అధ్యక్షత వహించారు.

ప్రముఖ పాత్రికేయులు **ఎ.బి.కె.ప్రసాద్** సభను ప్రారంభిస్తూ ఉపాధ్యాయుల సంక్షేమంకోసం, హక్కులకోసం నిరంతరం పోరాడిన సింగరాజు రామకృష్ణయ్యవంటి వారిని గుర్తుచేసుకోవటానికి ఇటువంటి సభలు జరపటం అవసరం అన్నారు. వారి జీవితాన్నుండి నూతనతరం ఉపాధ్యాయులు స్ఫూర్తిపొందాలన్నారు. సింగరాజు రామకృష్ణయ్యవంటి వారు చేసిన సేవలను మరచిపోయేటటువంటి, పట్టించుకోనటువంటి సామాజిక పరిణామాలు మన సమాజంలో నేడు సంభవిస్తున్నాయన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్వీర్యం చేయడానికి బ్రిటిష్ పాలకులు జారీచేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటంచేసి సంఘ స్వాతంత్ర్యం హక్కును సాధించినవాడు సింగరాజు అనీ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొనేవరకు అనేక ఉద్యమాలను జరిపారనీ అన్నారు. నేడు దానికి వ్యతిరేకమయిన పరిణామాలు రాష్ట్రంలోను, దేశంలోను జరుగుతున్నాయనీ, విద్యారంగంలో జరిగే పరిశోధనలు మానవాళి ప్రయోజనాలకొరకుకాక, పారిశ్రామికవేత్తల బహుళజాతి గుత్తసంస్థల లాభాల నార్జించే లక్ష్యంతో సాగుతున్నాయన్నారు. నూతన ఆర్థిక విధానాల అమలు తరువాత నైతిక విలువలు పడిపోయాయనీ, నీతిగా, నిజాయితీగా బ్రతకడంద్వారా వ్యవస్థను మార్చుకోగలం అనే స్పృహను కూడా రానీయనంతగా సమాజంలో అవినీతి ఊడలు వేసిందన్నారు. నూతన ఆర్థిక విధానాలను ఎదుర్కొంటూ ఉపాధ్యాయ ఉద్యమాన్ని ముందుకు నడిపించాలనీ, ఉపాధ్యాయులు తమ శిష్యవర్గాన్ని ప్రగతిశీల మార్గంవైపు నడిపించాలని పిలుపునిచ్చారు.

ఏపిటిఎఫ్ పూర్వ అధ్యక్షులు **ఏ.నరసింహారెడ్డి** ప్రసంగిస్తూ క్రమశిక్షణ, సమిష్టి ఆలోచన, సమిష్టి పనివిధానాలను సింగరాజు నుండి ఉపాధ్యాయులు నేర్చుకోవాలన్నారు. సింగరాజు ఆశయాలను అమలు పరిచే దిశగా ప్రయాణించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శాసనమండలి మాజీసభ్యులు **ఏ.శ్యామసుందరరావు** ప్రసంగిస్తూ సమిష్టి ప్రయోజనాలకోసం సమిష్టిగా ఉద్యమించాలనే సింగరాజు దానిని ఆచరించి చూపారన్నారు.

శాసనమండలి మాజీ సభ్యులు **ఎస్. హనుమంత రావు** ప్రసంగిస్తూ ఏ ఉపాధ్యాయ ఉద్యమ నేతతో లేనంత సంబంధం తనకు సింగరాజుగారితో ఉన్నదనీ, నిర్మాణపద్ధతులలో మార్గదర్శకత్వంకోసం తరచూ సింగరాజుగారిని కలిసేవాళ్ళమన్నారు. శాసనమండలి మాజీ సభ్యులు **వి.శ్రీరామమూర్తి** సింగరాజు రామకృష్ణయ్యకు, తనకుగల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

ప్రజాసాహితి ప్రధాన సంపాదకులు **కొత్తపల్లి రవిబాబు** మాట్లాడుతూ అధ్యయనానికి సింగరాజు అధిక ప్రాధాన్యతనిచ్చేవారన్నారు. భావిభారత పౌరులను తయారుచేసే మేధావులయిన ఉపాధ్యాయులు నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. ఏపిటిఎఫ్ కార్యకర్తలు కేవలం పాఠాలు చెప్పేవాళ్ళుగానే కాక రచయితలుగా, కళాకారులుగా, ఉపన్యాసకులుగా, నాయకులుగా తయారవ్వాలనే సింగరాజు జీవిత సారాంశాన్ని, ఉపాధ్యాయులు అందిపుచ్చుకోవాలన్నారు.

ఏపిటిఎఫ్ పూర్వ ప్రధానకార్యదర్శి **ఎన్.పరమేశ్వర రావు** ప్రసంగిస్తూ సింగరాజు శతజయంతి సభ జరుపుకోవటమంటే సింగరాజు ఆశయాలకు పునరంకితం కావటమన్నారు. 1944లో తాపేశ్వరంలో స్థాపించబడి నిషేధానికి గురయి... 1947లో సంఘం పునరుద్ధరింపబడిందన్నారు. ఏపిటిఎఫ్పై కమ్యూనిస్టు సంఘంగా ముద్రవేసి నిషేధించడంతో, విధానపత్రం రూపొందించుకొని, దానిని అధిగమించడం జరిగిందన్నారు. సింగరాజు ఆశయాల కొనసాగింపుకు కార్యకర్తలు దీక్షపూనాలన్నారు. సింగరాజు ద్వితీయ కుమారుడు **సుభాష్ చంద్రబోస్,** ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు **కె.భానుమూర్తి** ప్రసంగించారు.

అనంతరం జరిగిన విద్యాసదస్సుకు రాష్ట్రప్రధాన కార్యదర్శి **షేక్ జిలాని** అధ్యక్షత వహించారు. "నేటి విద్యారంగం–ఉపాధ్యాయ పాత్ర" అను అంశంపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం రీడర్ **కె.లక్ష్మీనారాయణ** ప్రసంగించారు. ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం 1973–74లలో వచ్చిన సంక్షోభాన్నుండి బయటపడటానికి ప్రపంచీకరణ పేరుతో అన్నిరంగాల ప్రైవేటీకరణకు పూనుకొన్నదని దానిలో భాగంగానే విద్య, వైద్యరంగాల ప్రైవేటీకరణ కొనసాగుతున్నదన్నారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరించేందుకు పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో 9 బిల్లులు ప్రవేశపెట్టనున్నారనీ, ఈ 9 బిల్లుల సారాంశము విద్యారంగం ప్రైవేటీకరణేననీ, ఉపాధ్యాయులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలనీ, ప్రభుత్వ పాఠశాలల పరరక్షణకు కృషిచేయాలనీ పిలుపునిచ్చారు.

"ప్రపంచీకరణ–ఉద్యమాలపై ప్రభావం" అను అంశంపై మానవహక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ **ఎస్.జీవన్కుమార్** ప్రసంగించారు. ప్రపంచీకరణ మన జీవనవిధానంపైనే కాదు మన ఆలోచనావిధానంపైనే విశిష్ట ప్రభావాన్ని కలుగజేసిందనీ, "భిన్న దేశాల ఆర్థిక వ్యవస్థలను ఏకైక ప్రపంచవ్యవస్థగా మార్చటమే ఆర్థిక ప్రపంచీకరణ" అని ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు నేత వాల్డెన్ బెల్లో అన్నారనీ, లాభాలకొరకు, మార్కెట్లకొరకే ప్రపంచీకరణ సాగుతున్నదనీ అన్నారు. ప్రపంచీకరణ సృష్టించిన వినియోగ వస్తువుల మాయలో పడకుండా ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ✤

## సోంపేట, కాకరాపల్లి అమరులకు జోహార్లు!

# ప్రజా జీవనాన్నీ, పర్యావరణాన్నీ విధ్వంసం చేసే, అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాల రద్దుకై నిర్మించే ఉద్యమాలను పీడిత వర్గ పోరాటాలలో భాగంగా సాగిద్దాం!

**జులై** 14వ తేదీకి సోంపేట బీలభూములలో పాలకులు రక్తం ప్రవహింపచేసి ఇద్దరు రైతులను బలిగొని ఏడాదవుతున్నది. అనంతర కాలంలో 2011 మార్చిలో శ్రీకాకుళంజిల్లాలోనే కాకరాపల్లిలో ఈస్టుకోస్టు ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ భూ ఆక్రమణలను నిరసిస్తూ ఉద్యమించిన రైతులు, మత్స్యకారులపై పోలీసులు కాల్పులు జరిపి ఇద్దరిని బలిగొన్నారు. (క్షతగాత్రులలో మరొకరు చికిత్స పొందుతూ ఇటీవలే మరణించారు.)

దేశవ్యాపితంగా బడా, బహుళజాతి పరిశ్రమల కోసం ప్రభుత్వం సాగిస్తున్న నిర్భంధ భూసేకరణ తీవ్ర ప్రతిఘటన నెదుర్కొంటున్నది. మహారాష్ట్రలోని జైతాపూర్ అణువిద్యుత్ కేంద్ర వ్యతిరేక పోరాటంపై జరిపిన కాల్పులలో ఇద్దరిని బలిగొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జాతీయ రహదారి పేరిట భూముల సేకరణను వ్యతిరేకిస్తున్న 'నోయిడా' ప్రజానీకంపై జరిగిన కాల్పులలో ఇద్దరు అశువులు బాశారు. ఒరిస్సా రాష్ట్రంలో పోస్కో దురాక్రమణను, దానికి కారణమైన ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రజలు నిర్భంధాన్ని ధిక్కరిస్తూ నిరంతరాయ పోరాటాల్ని సాగిస్తున్నారు.

మన రాష్ట్రంలో తీరాన్ని–ముఖ్యంగా నెల్లూరు జిల్లా తీరంలో కుప్పలు తెప్పలుగా రానున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా ఆందోళన సాగుతున్నది. ఉత్తరాంధ్ర జిల్లాలలో–శ్రీకాకుళం జిల్లా–కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగానూ ఆ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగానూ ప్రజల నిరసన బలపడుతున్నది.

1894 నాటి నిర్బంధ భూసేకరణ చట్టాన్ని ఉపయోగిస్తూ, విదేశీ సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం ప్రజల జీవనాన్నీ, పర్యావరణాన్నీ విధ్వంసం చేస్తూన్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాలన్నీ సమన్వయంతో, సమరశీలంగా, పీడిత వర్గ పోరాటంలో అంతర్భాగంగా సాగించేందుకు పూనికవహించవలసిందిగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) పిలుపునిస్తున్నది.

విప్లవాభినందనలతో

**విజయవాడ**
**14-7-11**

**ఎస్. ఝాన్సి**
**అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)**

కరపత్రం

# పొగాకు రైతుల పట్ల పాలకుల దగాకోరు విధానాలను ఎదిరిద్దాం! గిట్టుబాటు ధరకై ఉద్యమిద్దాం!!

**ప్రపంచంలో** పొగాకు పండిస్తున్న దేశాలలో భారతదేశం రెండవస్థానంలో ఉంది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 3 లక్షలకు పైగా ఎకరాలలో పొగాకు సాగుచేస్తున్నారు. ఈ పంటపై దాదాపు 3కోట్ల 50 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పంటపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు టాక్స్‌ల ద్వారా, విదేశీ మారకద్రవ్యం ద్వారా 15,000కోట్ల పైగా ఆదాయం వస్తున్నది. కానీ ప్రతి సంవత్సరం పంటకు ముందు రైతులను ప్రోత్సహించడం, పంట దిగుబడి తర్వాత వేలం కేంద్రాల ప్రారంభంతోనే రైతును నట్టేట ముంచటం ఐ.టి.సి. వ్యాపారుల ఆనవాయితీగా మారింది.

ఈ సంవత్సరం పొగాకు పంట ప్రారంభం నుండే అకాల వర్షాలు, ప్రకృతి సహకరించకపోవడంతో ఆలస్యంగా నాట్లు వేయడం, నేలలో తేమ తగ్గడం; పురుగు, తెగుళ్ళు రావడం, పంట బెట్టకు రావడంతో నీరుకట్టడం దగ్గర నుండి ఆకు కొట్టడం, కాల్చడం వరకు గత సంవత్సరాల కన్నా ఈ సంవత్సరం ఉత్పత్తి ఖర్చులు 40 శాతం మేరకు పెరిగాయి. ఉత్పత్తి ఖర్చులు ఎకరాకు 60 నుండి 80 వేల వరకు పెరిగాయి. పంట దిగుబడి 10 క్వింటాళ్ళ నుండి 4-5 క్వింటాళ్ళకు తగ్గిపోయింది. దిగుబడి తగ్గిపోయిన పంటను అమ్ముకొనే దశలో నాణ్యత కలిగిన ఎఫ్1 పొగాకును కూడా వ్యాపారస్తులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ రేటుకు కొనటం ప్రారంభించారు.

ఈ సంవత్సరం ఆంధ్రా సీజన్ పొగాకు బోర్డు ఉత్పత్తి పరిమాణం నిర్ణయించేటప్పుడు ఐటిఎ (ఇండియన్ టుబాకో అసోసియేషన్) వారు తమకు 190 మిలియన్ల పొగాకు అవసరమని ఇండికేషన్ ఇచ్చినా పొగాకు బోర్డు స్వదేశీ, విదేశీ అవసరాలను పరిగణలోకి తీసుకొని 170 మిలియన్ల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్ణయించటం జరిగింది. కానీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వలన 150 మిలియన్ల పొగాకు మాత్రమే పండింది. డిమాండ్-సప్లయి అనే ఆర్థిక సూత్రం ప్రకారం పొగాకు డిమాండ్ కన్నా ఈ సంవత్సరం సప్లయి తక్కువగా ఉన్నది కాబట్టి పొగాకుకు మంచి గిరాకీ ఉండి మంచిరేటు లభించాలి. అయితే పొగాకు వ్యాపారస్తులు, గుత్త వ్యాపారస్తులు కుమ్మక్కై సిండికేట్‌గా ఏర్పడి గిరాకీ ఉన్న పొగాకుకు గిట్టుబాటు రేటు ఇవ్వకుండా సీలింగ్ పెట్టుకొని వేలములో పాల్గొంటున్నారు. ఈ వ్యాపారస్తుల సిండికేట్‌కి ఐ.టి.సి. నాయకత్వం వహిస్తున్నది.

### ప్రభుత్వం, పొగాకు బోర్డు నిర్లక్ష్యపాత్ర

ఆరుగాలం కష్టపడి రైతులు పొగాకు పండిస్తున్నారు. రైతులకు కనీసం గిట్టుబాటుధర కూడా యివ్వకుండా రైతాంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారు. సిండికేటుగా ఏర్పడిన వ్యాపారస్తులకు పోటీగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పంట ద్వారా 15 వేల కోట్లకు పైగా ఆదాయం పొందుతూ ఎస్.టి.సి.కి నిధులు కేటాయించి పొగాకు కొనుగోలు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నది? రైతాంగం అడుగుతున్న 100 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం యిచ్చి సమాఖ్య, కోల్ సొసైటీలను మార్కెట్‌లో పోటీని పెంచకుండా కేవలం 20 కోట్లు యిచ్చి నామమాత్రపు పోటీని ఉంచుతున్నారు. పొగాకు బోర్డు వద్ద ఉన్న 200 కోట్లు నిధులతో ట్రేడ్‌వింగ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయుటకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పర్మిషన్ యివ్వకుండా ఐ.టి.సి. బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో అన్ని రంగాలనూ శాసిస్తున్న ఐటిసి పొగాకు రంగంలో వేల కోట్ల రూ॥లు లాభాలు గడుస్తూ తన గుత్తాధిపత్యముతో ప్రభుత్వాలను, బోర్డును, ప్రజాప్రతినిధులను శాసిస్తూ రైతాంగాన్ని నిలువుదోపిడీ చేస్తున్నది.

### లాభాలు ప్రభుత్వాలకు, వ్యాపారులకు – నష్టాలు రైతులకా!?

పొగాకు రంగములో ఐ.టి.సి. వేలకోట్లు రూ॥లను గడిస్తున్నది. 1 కేజి పొగాకుకు 1250 సిగరెట్లు తయారు చేసి 7 వేల రూ॥లు పొందుతూ రైతుకు ఇస్తున్నది కేవలం 80 రూ॥లు మాత్రమే. ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు యీ పంట ద్వారా పొందుతున్న ఆదాయములో తిరిగి ఒక్కశాతం ఖర్చుపెడితే రైతుకు గిట్టుబాటు ధర యివ్వవచ్చు. అమెరికా, యూరప్ దేశాలలో రైతులకిస్తున్న సబ్సిడీలు మన ప్రభుత్వాలు యివ్వటంలేదు. పన్నుల ద్వారా వేల కోట్ల రూ॥లు ఆదాయం పొందుతూ రైతుల్ని ఆదుకోకపోగా ఆత్మహత్యలకి నెడుతున్నది.

గత 4 సం॥ల నుండి వ్యాపారులు బోర్డు ద్వారా కొనుగోళ్ళు ఆలస్యం చేస్తూ, కర్నాటక కొనుగోళ్ళు పూర్తికాలేదని చెప్తూ కాలయాపన చేయడం వలన రైతుల దగ్గర ఉన్న పొగాకు రంగు మారడం, తూకం తగ్గిపోవడం, గోడౌన్ల అద్దెలు భరించడం లాంటి వాటితో నష్టపోతున్నారు. ఈ సం॥ తీసుకున్న రుణాలను బ్యాంకులకు పూర్తిగా చెల్లించలేని పరిస్థితులలో రైతులు ఉన్నారు. బ్యాంకులు రిజర్వు బ్యాంకు పర్మిషన్ యివ్వలేదని రుణాలను రీషెడ్యూల్ చేయడంలేదు. దీనితో దిక్కుతోచని రైతాంగం ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల మీద ఆధారపడి వేలకు వేలు వడ్డీలు కట్టుటయే సరిపోతుంది. కౌలు రైతాంగం పరిస్థితి మరింత అధ్వాన్నముగా ఉన్నది. బ్యాంకురుణాలు లేక, ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తుల దగ్గర తెచ్చి ఒక ప్రక్క రేటు రాక నిస్సహాయస్థితిలో ఉన్నారు.

పొగాకు రైతుల సమస్యలకి మూలం ఎక్కడున్నదో పరిశీలించకుండా సమస్యకు పరిష్కారం క్రాప్‌హాలిడే అనే ఆలోచన ముందుకు తెస్తున్నారు. 2000-01 సం॥ క్రాప్‌హాలిడే పొగాకు పంటపై ఎటువంటి మార్కెట్ ప్రభావం చూపించక పోగా మరుసటి సం॥ కూడా పొగాకు గిట్టుబాటు ధరకోసం పోరాడాల్సి వచ్చిందన్నది రైతాంగం గుర్తు చేసుకోవాలి. రైతు పక్షపాత ప్రభుత్వాలయితే మన నుండి కేజీ పొగాకు కొనని జపాను, జర్మనీల నుండి వేలకోట్ల రూ॥ల ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు ఎందుకు దిగుమతి చేసుకోవడానికి అనుమతిస్తుందో, ప్రభుత్వాలకు జాతీయత ఉందో లేదో రైతాంగం ఆలోచించాలి. వ్యాపారస్తులు ఆర్డర్లు లేవని, అంతర్జాతీయంగా →

→ వ్యాపారస్తులకు గిట్టుబాటు రావడం లేదని, అందువలన పొగాకుకు యిప్పుడిచ్చే ధర కంటే ఎక్కువకు కొనుగోలు చేయలేమని రైతుల దగ్గర నుండి పొగాకు వ్యాపారస్థుల దగ్గరకు పోయిందాకా ఏర్పరిచే సంక్షోభమేనని, దీన్ని రైతాంగం త్రిప్పికొట్టి గిట్టుబాటు ధరకోసం పెద్దయెత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాము.

**డిమాండ్స్ :**

1. పొగాకు కిలో ఎఫ్1 150 రూపాయలకు కొనుగోలు చేయాలి.
2. కేంద్ర ప్రభుత్వం 500 కోట్లు కేటాయించి రైతుల వద్ద నుండి ప్రత్యక్షంగా పొగాకు కొనుగోలు చేయాలి.
3. రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రంగా కేటాయించిన 20 కోట్లను 100 కోట్లకు పెంచాలి.
4. పొగాకు కిలోకు సరాసరి ధర రూ. 120/-లు ఇవ్వాలి.
5. బోర్డు వద్దనున్న నిధులతో ట్రేడ్ వింగ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలి.
6. పొగాకు బోర్డుకు వ్యాపారస్తులు ఇచ్చిన ఇండికేషన్ ప్రకారం వ్యాపారస్తులచే కొనుగోలు చేయించాలి.
7. వేలములో సిండికేట్ విధానాన్ని బ్రద్దలు కొట్టడానికి, సీలింగ్ ధరల వద్ద బేళ్ళను వ్యాపారులకు కేటాయించకుండా లాటరీ విధానాన్ని ప్రవేశపెట్టాలి.
8. పొగాకు రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిని నిరశించండి.

**ఒంగోలు**
**1-6-11**

**రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్)**
ప్రకాశం జిల్లా

# పాలకుల అవినీతికి వ్యతిరేకంగా పోరాడండి

## 11 రాజకీయ పార్టీల పిలుపు

**దేశంలో** పెరిగిన అవినీతి మహమ్మారి ఆందోళన కలిగిస్తున్నది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా వివిధ పక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు సాగుతున్నాయి.

దేశంలో అవినీతి వ్యవస్థీకృతమైంది. సరళీకృత విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవినీతి తారాస్థాయికి చేరుతున్నది. ఒకవైపు కోట్లాది ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే దారిద్ర్యం, అవిద్య, అనారోగ్యం దేశాన్ని పీడిస్తుంటే మరోవైపు లక్షల కోట్ల రూపాయలను అవినీతిపరులు కొల్లగొడుతున్నారు. 2జి స్పెక్ట్రం కుంభకోణం, గ్యాస్ నిక్షేపాల కుంభకోణం, ఎస్‌బ్యాండ్ కుంభకోణం, కామన్‌వెల్త్ క్రీడలు, కార్గిల్ అమరవీరుల గృహనిర్మాణం తదతర కుంభకోణాలు దిగ్భ్రాంతి కల్గించాయి. కేంద్ర ప్రభుత్వంలోని అత్యున్నత విధాన నిర్ణాయక స్థానాలే ఈ అవినీతికి కేంద్రాలుగా మారడం గమనించాల్సిన విషయం. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తల మధ్య పెరిగిన ఈ అవినీతి బంధం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వం ఆశ్రిత పెట్టబడిదారీ విధానాన్ని అమలు జరుపుతున్నది. గనులు, భూమి, సముద్రతీరం లాంటి ప్రకృతి వనరులను, జాతి సంపదను, ప్రభుత్వ నిధులను కొల్లగొట్టి తమ వారికి కట్టబెట్టుకునేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నది. ప్రపంచబ్యాంకు రుణ ఒప్పందాలలో "గ్రీజ్ ఆన్ వీల్స్", "కిక్ బ్యాక్స్" వంటి ముద్దు పేర్లతో అవినీతి విస్తరిస్తున్నది.

గత కొన్ని సంవత్సరాలుగా ఈ అవినీతి గురించి వామపక్షాలు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెస్తున్నప్పటికీ ప్రధానమంత్రి మాత్రం అంతా సజావుగానే వున్నట్లు సమర్ధించుకున్నారు. పార్లమెంట్‌లో ఎన్నిసార్లు ఈ అంశాన్ని లేవనెత్తినప్పటికీ ప్రధాన ప్రతిపక్షంగా వున్న బిజెపి నోరుమెదపలేదు. దేశవ్యాపితంగా వామపక్షాలు అనేక ఆందోళనలు చేయడం, చివరకు కాగ్ సైతం ఈ అక్రమాలను బట్టబయలు చేయడంతో బిజెపి కూడా స్పందించక తప్పలేదు. చివరకు 2జి స్పెక్ట్రం కుంభకోణంపై పార్లమెంటరీ కమిటీని సాధించడానికి పార్లమెంట్‌ను స్థంభింపజేయాల్సి వచ్చింది. దేశవ్యాపితంగా అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో పెరుగుతున్న స్పందనను గమనించిన తర్వాతనే కేంద్రం కూడా అవినీతిని గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. సుప్రీంకోర్టు అక్షింతలు వేసిన తర్వాతనే లోక్‌పాల్ బిల్లు గురించి మాట్లాడుతున్నది. రాష్ట్రంలో సైతం ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ భూమి, సెజ్‌లు తదితర అవినీతి కుంభకోణాలు మాత్రం వెల్లువెత్తుతున్నాయి.

దేశంలో అవినీతి నిర్మూలనకు రాజకీయ రంగంలోనూ, న్యాయ, చట్ట, పరిపాలనా రంగాల్లోను సమగ్రమైన సంస్కరణలు అవసరం. ఇందులో భాగంగానే సమర్థవంతమైన లోక్‌పాల్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలి. గత నాలుగు దశాబ్దాలుగా లోక్‌పాల్ వ్యవస్థను ఏర్పాటుచేయాలని, దాని పరిధిలోకి ప్రధానమంత్రిని తేవాలని డిమాండ్ వచ్చినప్పటికీ పార్లమెంట్ ఆమోదానికి నోచుకోలేదు. ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టం చేసినప్పటికీ అది అసమగ్రంగా వున్నది. అవినీతిని పునర్నిర్వచించడం అవసరం. కేవలం లంచాల రూపంలోనే కాక అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం, ఎన్నికల్లో అవినీతి, ముడుపులు, ప్రయివేటు కంపెనీలకు, సంస్థలకు దొడ్డిదారిన అదనపు ప్రయోజనాలు సమకూర్చిపెట్టడం తదితర అనేక రూపాల్లో అవినీతి పెరుగుతున్నది. లోక్‌పాల్ వ్యవస్థ చట్టబద్ధ హక్కులు కలిగివుండటమే కాక పారదర్శకంగా, స్వతంత్రంగా వ్యవహరించగల్గే సంస్థగా వుండాలి. ఉన్నతస్థాయి అవినీతి జరిగినపుడు నిజనిర్ధారణ చేసేదిగాను, సుప్రీంకోర్టుకు నివేదించేదిగాను వుండాలి. విచారణ జరిపేందుకు, పరిశోధన జరిపి వాస్తవాలు వెలికి తీసేందుకు అదేశించగల అధికారాలు దీనికి వుండాలి. అవినీతిపరుల పరమైన డబ్బును తిరిగి రాబట్టేందుకు తగిన అధికారాలు కల్గివుండాలి. పార్లమెంట్ సభ్యుల అవినీతి ప్రస్తుత అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి రావడంలేదు. రాజ్యాంగంలో ఆర్టికల్ 105కు తగు సవరణ చేసి చట్టపరిధిలోకి తేవాలి. లక్షల కోట్ల సంపద వివిధ రూపాల్లో విదేశాలకు తరలిపోతున్నది. అవినీతి సంపాదన స్విస్ బ్యాంకులోకి, ఇతర దేశాలకు ఇప్పటికే సుమారు 70 లక్షల కోట్ల రూపాయల మేరకు తరలిపోయిందని అంచనా. ఈ సంపదను దేశానికి తెప్పించాలి. పేదరికం నిర్మూలనకు వినియోగించాలి.

ఈ నెల 23న హైదరాబాదులో రాష్ట్ర సదస్సు, వారం రోజుల పాటు అవినీతికి వ్యతిరేకంగా జిల్లా స్థాయి సదస్సులు నిర్వహించాలని 11 పార్టీలు పిలుపునిస్తున్నాయి.

**డిమాండ్స్**

1. **సమర్ధవంతమైన లోక్‌పాల్ చట్టం చేయాలి. ప్రధానిని, ఉన్నతాధికారులను దీని పరిధిలోకి తేవాలి.**
2. **ఉన్నత న్యాయవ్యవస్థలోని అవినీతి నిర్మూలన కోసం జాతీయ న్యాయ కమీషన్ ఏర్పాటు చేయాలి.**
3. **ఎన్నికల్లో ధనబలాన్ని నిరోధించేందుకు వీలుగా దామాషా ప్రాతినిధ్య విధానం వంటి సంస్కరణలు చేపట్టాలి.**
4. **పార్లమెంట్ సభ్యుల అవినీతిని అరికట్టేందుకు వీలుగా ఆర్టికల్ 105ను సవరించాలి.**
5. **పన్నుల విధానంలో సవరణలు చేయాలి. పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తల ఆదాయం, ఆస్తి, కార్పోరేట్ పన్నుల ఎగవేతకు అవకాశం లేకుండా చూడాలి.**
6. **విదేశీ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికితీయాలి. అస్మదీయ పెట్టుబడిదారీ విధానం అవలక్షణాలను నిర్మూలించాలి. అవినీతిపరులను కఠినంగా శిక్షించాలి.**
7. **కేంద్రంలో లోక్‌పాల్ వ్యవస్థలో లాగానే రాష్ట్రస్థాయిలో కూడా లోకాయుక్త వ్యవస్థను ఏర్పాటు చేయాలి.**

| | | |
|---|---|---|
| సిపిఐ (ఎం) | సిపిఐ | సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ |
| సిపిఐ (ఎం-ఎల్) | ఎంసిపిఐ(యు) | సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ |
| ఫార్వర్డ్ బ్లాక్ | ఆర్ఎస్‌పి | సిపిఐ (ఎం-ఎల్) |
| ఎస్‌యుసిఐ (సి) | ఎంఎల్ కమిటీ | |

# జి.వి.కె. బయో, యాక్సిస్ ఔషధ ప్రయోగ కంపెనీల బాధితుల డిమాండ్ల పరిష్కారానికై ఆందోళన



ఔషధ ప్రయోగ బాధితులకు న్యాయం చేయాలని పిడుగురాళ్ళలో ఆందోళన; స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో పిడుగురాళ్ళలో రాస్తారోకో; గుంటూరులో కలెక్టరుకు వినతిపత్రం

**పిడుగురాళ్ళ, 28-6-11 :**

**ఔషధ** కంపెనీ ప్రయోగ బాధితులకు నష్టపరిహారం అందించాలని, బాధితులకు వైద్య సౌకర్యం అందించాలని, జి.వి.కె.బయో, యాక్సిస్ కంపెనీల యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో పిడుగురాళ్ళ పట్టణంలో ప్రదర్శన, ఏడుకొట్ల సెంటర్‌లో రాస్తారోకో, తహశీల్దార్ కార్యలయం వద్ద ధర్నా అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ కా॥ మండవ శోభారాణి మాట్లాడుతూ లెనిన్‌నగర్, ఆదర్శనగర్ కాలనీలో నివసిస్తున్నది ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ పేదవర్గాలవారికి చెందిన వారని, పనిచేస్తేనే గాని పూటగడవని వారనీ ఇలాంటి పేదల యొక్క అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను, పేదరికాన్ని ఆసరాచేసుకొని ఔషధ కంపెనీలు ప్రయోగాలు చేయడం దారుణమని, ఔషధ కంపెనీలు పేదల జీవితాలను బలితీసుకుంటూ వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయని, విచ్చలవిడిగా ప్రజలపై ఔషధ ప్రయోగాలు చేస్తున్న ఔషధ కంపెనీలను రద్దు చేయాలని, ఆయా యాజమాన్యాలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కా॥ ఎస్. లలిత కుమారి మాట్లాడుతూ మన దేశంలో విదేశీ బహుళజాతి మందుల కంపెనీలు, వాటి ప్రాజెక్టులను పొందిన కంపెనీలు పేద ప్రజల యొక్క జీవితాలను నాశనం చేయడం దారుణమని, ఈ ఔషధ ప్రయోగాలకి తమ దేశాలలో కంటే భారతదేశంలో నాల్గవ వంతు ఖర్చుతో పూర్తి చేసి మార్కెట్‌లో వేలకోట్ల రూపాయలు లాభాలను పొందుతున్నాయని, కంపెనీలకు లాభాలు తప్ప పేదల జీవితాలు ఏమైనా లెక్క లేనిదిగాఉందని అన్నారు. ప్రభుత్వాలు బాధితులకు తక్షణ వైద్యం అందించాల్సింది పోయి రెండు, మూడు రోజులు టెస్టులు, వైద్యం చేసి మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఇంటికి పంపించి వేశారని, కాని వారి ఆరోగ్య పరిస్థితి మాత్రం ఎలాంటి మార్పూ లేకుండా అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలకు కంపెనీ యాజమాన్యం నుండి ఒక్కొక్కరికి 5 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, బాధితులకు జీవితాంతం వైద్యం చేయించాలని, జీవనభృతిని కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకురాలు కా॥ ఎం. నిర్మల; జె. పద్మ, రమాదేవి, సైదాబి, హఫీజ్; ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

**పిడుగురాళ్ళ, 7-7-11:**

ఔషధ ప్రయోగాల బాధితులకు తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలని, జి.వి.కె.బయో, యాక్సిస్ ఔషధ ప్రయోగ కంపెనీల యాజమాన్యాలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం, స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతుకూలీసంఘం జిల్లా అధ్యక్షులు సింహాద్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కంటితుడుపుగా యాక్సిస్‌ల్యాబ్‌ను మూసివేసింది తప్ప యాజమాన్యంపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటం సిగ్గుచేటని అన్నారు.

రైతుకూలీసంఘం జిల్లా సహాయకార్యదర్శి కా॥పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పిడుగురాళ్ళలోని లెనిన్‌నగర్, ఆదర్శనగర్, ఇందిరాకాలనీలలోని పేదలపై ఔషధ కంపెనీలు చేసిన ప్రయోగాలవలన తమ జీవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు చెప్తున్నా పట్టించుకోని ప్రభుత్వాలు, ప్రయోగాలు చేసుకోవడానికి అంతర్జాతీయ బహుళజాతి ఔషధ కంపెనీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చిందని, బాధితులకు న్యాయం జరగాలంటే ఈ దళారీ పాలకవర్గ విధానాలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటమేతప్ప వేరే మార్గంలేదని పిలుపునిచ్చారు.

ఇంకా ఈ కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ఎం.నిర్మల,రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ఎన్.రాంబాబు పాల్గొని ప్రసంగించారు. చైతన్య సున్నం మిల్లుల వర్కర్స్ యూనియన్ నాయకులు పొలేసు, వెంకట్రావు; స్త్రీవిముక్తి సంఘటన సభ్యులు ఆదెమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు, 11-7-11:**

ఔషధ ప్రయోగాలకు పాల్పడిన కంపెనీల యాజమాన్యాలను అరెస్టు చేసి, క్రిమినల్ కేసు బనాయించాలని, ఔషధ కంపెనీలనుంచే నష్టపరిహారాన్ని వసూలుచేసి బాధితులకు ప్రభుత్వం అందజేయాలని, బాధితులు ఒక్కొక్కరికి 5 లక్షల రూ॥ల పరిహారం చెల్లించాలని, బాధితులకు శాశ్వత జీవనోపాధిని ప్రభుత్వమే చూపించాలని, బాధితులకు జీవితకాలం వైద్య చికిత్సలను ఉచితంగా ప్రభుత్వ బాధ్యతపై నిర్వహించే ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేస్తూ గుంటూరులో స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం కలెక్టరును కలిసి పై డిమాండ్స్‌తో మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. నిర్మల, కె. అజిత; స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్, మండవ శోభారాణి మరియు బాధితులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు. ✤

## మాన్యం సాగుదార్లను కౌలురైతులుగా గుర్తించాలని ఆందోళన



రైతాంగ సమస్యలపై గుంటూరులో ప్రదర్శన

**గుంటూరు, 11-7-11 :**

దేవాదాయ, ధర్మాదాయ, మాన్యం భూముల కౌలు సాగు రైతులకు భూ అధీకృత కౌలు గుర్తింపుకార్డులను యివ్వాలని, భూ యజమానుల ఒప్పందంతో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించాలని, కౌలు రైతులకు రక్షణ కల్పించాలని, పంట నష్టపరిహారాన్ని అందించాలని, కౌలు రైతులపట్ల ప్రభుత్వ వివక్షతను విడనాడాలని డిమాండ్ చేస్తూ పల్నాడులోని రాజుపాలెం, పిడుగురాళ్ళ, కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల నుండి తరలివచ్చిన వందలాదిమంది దేవాదాయ, ధర్మాదాయ మాన్యం భూముల కౌలు రైతులు గుంటూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రైల్వేస్టేషన్ నుండి ప్రారంభమయిన ప్రదర్శన నాజ్‌సెంటర్, ఉమెన్స్ కాలేజి, కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం, స్టాల్‌గాల్స్ హైస్కూల్, మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకుంది.

జిల్లా పరిషత్ వద్ద జరిగిన ధర్నాలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ సింహాద్రి లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట ప్రభుత్వం భూ అధీకృత కౌలుదారుల గుర్తింపు కార్డులను మంజూరు చేస్తానని, కౌలు రైతులకు రక్షణ, భద్రతని కల్పిస్తానని ఆర్భాటం చేస్తూ హడావుడి చేస్తుంది తప్ప ఆచరణలో 'ఒట్టిస్తరీ మంచినీళ్ళ''లా తేలిపోయిందని అన్నారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ ఉల్లిగడ్డల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాపితంగా దేవాదాయ ధర్మాదాయ మాన్యం భూములను కౌలు సాగుచేస్తూ పదుల సంవత్సరాలుగా దేవాదాయ శాఖవారి రికార్డులలో కౌలుదారులుగా నమోదు కాబడి ఉన్నప్పటికీ మాన్యం భూములు సాగుచేసుకుంటున్న రైతులను ప్రభుత్వం కౌలుదారులుగా గుర్తింప నిరాకరిస్తున్నదని, ప్రభుత్వ భూములను సాగుచేస్తున్న వారిని కౌలు దారులుగా గుర్తించే జి.ఓ.నే లేదని, మిమ్ములను కౌలుదారులుగా గుర్తించం, అని చెప్పడమంటే-ఈ ప్రభుత్వం యొక్క వైఖరి పేద కౌలు రైతులకు వ్యతిరేకమైనదిగా ఉన్నదని స్పష్టమౌతున్నదన్నారు.

రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు సాగుచేసేవారిని కౌలు దారులుగా గుర్తించకపోతే, ధనిక, భూస్వామ్య వర్గాలవారి స్వంత పట్టాభూములలో సాగు చేసేవారికి గుర్తింపు కార్డులు రావటం కూడా దుర్లభమవు తుందని, ప్రభుత్వమే తన భూములకు యివ్వ నిరాకరిస్తే ప్రైవేటు వ్యక్తులు మరిన్ని ఇబ్బందులకు గురి చేస్తారని విమర్శించారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ మండవ శోభారాణి మాట్లాడుతూ సత్వరమే ప్రభుత్వం స్పందించి మాన్యం భూముల సాగుదార్లకు కౌలు గుర్తింపు కార్డులను అందించాలని లేకుంటే రాష్ట్ర వ్యాపితంగా కౌలురైతులందరు ఆందోళనలు నిర్వహించి, ప్రభుతం మెడలు వంచైనా గుర్తింపు కార్డులను సాధించుకుంటారని, అందుకు కౌలు రైతులందరూ పోరాటాలకి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కా॥ కె. ముసలయ్య, జిల్లా కమిటి సభ్యులు కా॥ నీలాద్రి రాంబాబు, కా॥ దానబోయిన భాస్కర్, కా॥ జక్కంపూడి పద్మ తదితరులు పాల్గొని మాట్లాడారు.

**కారంపూడి, 7-7-11 :**

కారంపూడి మండలంలో అనేక గ్రామాలలో దేవాదాయ, ధర్మాదాయ, మాన్యం భూములను నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ ప్రజలు గత 15 సం॥లుగా కౌలుకు సాగుచేసుకుంటున్నారు. సంబంధిత దేవాదాయ శాఖకు, పూజారులకు క్రమంతప్పకుండా అనుకున్న విధంగా ప్రతి సం॥ కౌలు చెల్లిస్తూనే ఉన్నారు. దేవాదాయశాఖ 2010 జూన్ నెలలో నిర్వహించిన కౌలు వేలం పాటలో పాల్గొని గతంకంటే హెచ్చు కౌలుకు పాడి, పాటదారు ఒక్కొక్కరు 2000/- రూ॥ డిపాజిట్ కూడా చెల్లించి వున్నారు.

అయితే ప్రభుత్వము ఈ సం॥ కౌలు దారులకు భూ ఆధారిత గుర్తింపు కార్డులను మంజూరు చేసి, రుణ వసతి; ఎరువులు, విత్తనాలు, సబ్సిడీ ధరలకు అందిస్తామని ప్రకటిస్తున్నది. అయితే మాన్యం భూముల కౌలు సాగుదార్లుగా వీరిని గుర్తించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో మాన్యం భూముల కౌలు రైతులు స్థానిక తహసిల్‌దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి ఉన్నతాధికారులకు విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కా॥ జె. పద్మ ఇంకా మరియదాసు, పున్నయ్య, కౌలురైతులు పాల్గొన్నారు. ✤

**ప్రజల...** (చివరి పేజీ నుండి)

భాగస్వాములుగా వున్నారని, అయితే కేవలం వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకొని పోరాడడంకాదని, పాలకుల భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ విధానాలను వ్యతిరేకిస్తూ వర్గపోరాటాన్ని పదునుపెట్టుకోవాల్సివుందనీ అన్నారు. గత వీరోచిత శ్రీకాకుళ గిరిజనోద్యమ చరిత్రను గుర్తుచేస్తూ, ఇదే జులై 10వ తేదీ కామ్రేడ్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం అమరులయ్యారని వారిని స్మరించుకున్నారు. ఈ జులై 14వ తేదీకి సోంపేట బీల భూములకోసం సాగిన ఉద్యమంలో ఇద్దరు రైతులు చనిపోయి సంవత్సరకాలం అవుతున్నదని గుర్తుచేశారు. ఆనాడు విశాఖ ఉక్కు-ఆంధ్రులహక్కు అంటూ ప్రభుత్వరంగ పరిశ్రమ స్థాపనకోసం పోరాడిన ప్రజలపై పోలీసులు కాల్పులు జరిపి 32మందిని చంపిన తర్వాతే పరిశ్రమ వచ్చిందనీ, ఈనాడు ప్రైవేటు పెట్టుబడిదారీ వర్గాలు, బహుళజాతి కంపెనీలు పెట్టాలనుకుంటున్న పర్యావరణ విధ్వంసక పరిశ్రమలు మాకొద్దని పోరాడుతున్నందుకూ ఈ పాలకులు ప్రజలను కాల్చి చంపుతున్నారనీ అన్నారు. సంఘటిత ఉద్యమాలను నిర్మించటంద్వారా శ్రీకాకుళ పోరాట వారసత్వాన్ని నిలపాలన్నారు. ఈ క్రమంలో తప్పుడు పద్ధతులద్వారా, ప్రజలను మభ్యపరిచే శక్తులపట్ల, ప్రజల సంఘటిత శక్తిని దెబ్బతీసే శక్తులపట్ల అప్రమత్తంగా ఉండి, ఈ ఉద్యమాలను పీడితవర్గ పోరాటంలో అంతర్భాగంగా సాగించాలని పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్రకార్యదర్శి కా॥కె.కోటయ్య మాట్లాడుతూ అణువిద్యుత్ ప్లాంట్లు ఎంత ప్రమాదకరమో రష్యా, అమెరికాలలో జరిగిన అణు ప్రమాదాల తర్వాత వెల్లడైందనీ, ఇటీవల జపాన్‌ఫుకిషిమా అణువిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రమాదం తర్వాత ప్రపంచవ్యాపితంగా అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసన పెల్లుబుకుతుండగా, ఆయా దేశాల్లోని పాలకులు ప్రజల నిరసనలకు తలొగ్గి అణువిద్యుత్ కేంద్రాల మూసివేతకు నిర్ణయాలు తీసుకుంటూవుంటే, మనదేశ దళారీ పాలకులు మనదేశంలో అణువిద్యుత్ కేంద్రాల స్థాపనకు తహతహలాడిపోతున్నారని వారి ప్రజావ్యతిరేక స్వభావాన్ని ఎండగట్టారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥గణేష్ పండా మాట్లాడుతూ ఉత్తరాంధ్ర మూడు జిల్లాలలోనూ సుమారు 20 నదులున్నాయనీ, వీటిద్వారా 500 టి.ఎం.సి.ల సాగు నీరు ప్రవహిస్తున్నదనీ, వేలాది ఎకరాల భూమి సాగవటానికి పుష్కలమైన వనరులున్నాయనీ, కానీ ఈ విధ్వంసకర పరిశ్రమల స్థాపనతో ఈ వనరులు ప్రజల పరంగాకుండా పోతున్నాయని, మత్స్యకారులు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారనీ, ఈ నేపథ్యంలో సహజ సంపదలపై సర్వహక్కులూ ప్రజలవేనని చాటుతూ ఐక్య పోరాటాల నిర్మాణానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥డి.వర్మ మాట్లాడుతూ సోంపేటలో ఎన్.సి.సి.కి అప్పగించిన బీల భూములుకానీ, సంతబొమ్మాళి ఈస్టుకోస్టు ఎనర్జీ లిమిటెడ్ కంపెనీకి పందేరం చేసిన తంపర భూములుకానీ, విజయనగరం జిల్లా కోటిపాంలో ఆల్ఫా ఇన్‌ఫ్రా కంపెనీ స్వాధీనం చేసుకున్న భూములు కానీ నీటివనరులు పుష్కలంగా ఉండి పంటలు పండే ప్రాంతాలేననీ, కాలుష్యం వెదజల్లే ఈ కంపెనీలు తమ గ్రామాలమధ్య వద్దంటూ స్థానిక ప్రజలు సాగిస్తున్న ఆందోళనలను సమన్వయంతో, సంఘటితంగా సాగించాలని పిలుపునిచ్చారు.

ప్రజాకళాకారులు డప్పువాయిద్యాలతో, జనంపాటలతో సదస్సుకు హాజరైన ప్రజలలో స్ఫూర్తిని నింపారు. సుమారు 600మంది పాల్గొన్న సదస్సు ఉదయం 11 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటలవరకు క్రమశిక్షణాయుతంగా జరిగింది. ✤

# మొఖాసాదారులకి కొమ్ముకాస్తున్న పాలకులు, రెవిన్యూ యంత్రాంగం

**తూర్పుగోదావరి** జిల్లా రంపచోడవరం డివిజన్ గంగవరం మండలంలోని నెల్లిపూడి, కురంగొంది గ్రామాలలో ముఠాదారీ వ్యవస్థను ఇప్పటికీ రెవిన్యూ యంత్రాంగం కాపాడుతున్నది.

మండలంలోని శివారు గ్రామం అయిన కురంగొందిలో కోయదొర అనే గిరిజన తెగ ప్రజలు 80 కుటుంబాలవారు తాతలు, ముత్తాతలనుండీ తరతరాలుగా నివాసం ఉంటున్నారు. ఊరుచుట్టుప్రక్కల అడవి తుప్పలను బాగుచేసుకుని వ్యవసాయ యోగ్యమైన భూములుగా తీర్చిదిద్ది స్థిరమైన వ్యవసాయం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాలలో వనరుల మీద పెత్తనం చెలాయించి తమ పరిపాలనను సాగించుకునేందుకు గిరిజన ప్రాంతాలలో బ్రిటీషువాడు ముఠాదారీ వ్యవస్థను తీసుకుని వచ్చాడు. ఆ ప్రాంత ముఠాదారుకి సంబంధించిన భూమే మొఖాసా భూమి. మోహినీపురం ముఠాదారుకి కురంగొంది గిరిజనులు పన్నుకట్టేవారు. డబ్బు రూపంలో కాకుండా నెయ్యి, గుమ్మడికాయలు, చింతపండు తదితర వస్తురూపంలో చెల్లించేవారు.

అనేక గిరిజన ప్రజాపోరాటాలు ఫలితంగా ముఠాదారి వ్యవస్థ రద్దుఅయిపోయింది. ప్రభుత్వం దగ్గర గుర్తింపు పొందిన ముఖాసాదారుడు చనిపోయి చాలాకాలం అయ్యింది. ఆయన వారసులు ఎవరూ లేరు. అయినప్పటికీ మొఖాసాదారు వారసులమంటూ కొందరు 1991 వరకూ అమాయిక గిరిజనులుచేత పన్నులు కట్టించుకున్నారు.

మొఖాసాలు రద్దు అయిపోయిన వెంటనే మొఖాసా భూములన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని గిరిజనులకు హక్కు కల్పిస్తామని ప్రకటించింది. ఆ మేరకు ప్రభుత్వం 1974లో కురంగొంది, నెల్లిపూడి, తదితర గ్రామాలలో సర్వే జరిపించింది. కానీ, ఆనాటి నుండి ఈనాటి వరకూ ఆ భూములుమీద గిరిజనులకి హక్కు కల్పించలేదు. వారికి హక్కులు కల్పించకపోగా ప్రభుత్వం చేసిన చట్టాలను సైతం పక్కనపెట్టి, మొఖాసాదారులతో కుమ్మక్కైనటువంటి చట్టప్రకారం లేని అధికారాలను ఉన్నట్టు ప్రజలను భ్రమింపచేస్తున్నారు. ఈ నకిలీ వారసులు కొందరు, రెవిన్యూ అధికార్లను లోబర్చుకొని హైకోర్టులో కేసులుమీద కేసులు వేసి అవి విచారణకి రాకుండా వాయిదా వేయిస్తూ కోర్టు వివాదం పేరిట భూములకి పట్టాలు రాకుండా అడ్డుకుంటున్నారు. ఇలాంటి స్థితిలో ఏజెన్సీ గిరిజన సంఘం-ఓపిడిఆర్‌వంటి ప్రజాతంత్ర సంస్థ అండతో హైకోర్టులో ఈ కేసుల్లో తనూ ఒక భాగస్వామి అయ్యి కేసులను సత్వరం పరిష్కరించాలని కోరుతున్నది. మరోపక్క ఈ కేసులన్నీ అధ్యయనం చేశాక, పట్టాలు ఇవ్వడానికి ఈ కేసులు అడ్డంకికాదనీ, కోర్టులో ఏ కేసు నిలవదని స్పష్టమౌతున్నది. కోనేరు రంగారావు కమిటీ కూడ కోర్టు వివాదాల సాకుతో గిరిజన, దళిత భూముల విషయంలో న్యాయం జరగకుండా ఉండరాదని, వెంటనే కేసుల విషయం పరిష్కరించాలని తన సిఫారసులలో పేర్కొంది. కనుక **వెంటనే ప్రభుత్వం కురంగొంది గిరిజనులకి పట్టాలు మంజూరుచేయాలని, అలానే నెల్లిపూడి దళిత, బలహీన వర్గాల ప్రజలకు 1/70 చట్టానికి విఘాతం కలగకుండా సాగు రికార్డులు ఇవ్వాలనే డిమాండ్స్‌తో రంపచోడవరం ఐటిడిఏ వద్ద ఏజన్సీ గిరిజన సంఘం ఆందోళనా కార్యక్రమం నిర్వహించింది.**

# భూమి సమస్యపై ఐటిడిఏ కార్యాలయంవద్ద ఆందోళన



భూమి సమస్యపై రంపచోడవరంలో ధర్నా

**రంపచోడవరం, 27-6-11:**

తూర్పుగోదావరి జిల్లా ఏజెన్సీలోని గిరిజనుల భూమి సమస్యపై ఏజెన్సీ గిరిజన సంఘం నాయకత్వంలో ప్రజలు 40 సం॥రాలుగా పోరాడుతున్నారు. గిరిజనులవద్ద నుండి అక్రమంగా భూస్వాములు కాజేసిన భూములను తిరిగి సంఘం నాయకత్వాన స్వాధీనం చేసుకొని నేటికీ సాగుదారులుగా ఉన్నారు. 1/70 చట్టం, కోనేరు రంగారావు సిఫార్సులు ఉన్నప్పటికీ భూస్వాముల దొంగ సెటిల్‌మెంట్ ఆర్డర్లను రద్దుచేయకుండా ప్రభుత్వ ఉన్నతాధికారులు భూస్వాములతో కుమ్మక్కై వారి పేర్లతోనే అడంగల్ రికార్డులు తయారుచేస్తున్నారు. గిరిజన ప్రాంతంలో సాగుదారులైన గిరిజనులకే పట్టాలు ఇవ్వాలని, గిరిజనేతరులకి ఉన్న సెటిల్‌మెంట్ ఆర్డరును రద్దు చేయాలని ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నా పట్టించుకోని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు; తమ స్థానిక సమస్యల పరిష్కారంకోసం ఏజెన్సీ గిరిజన సంఘం రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయంవద్ద ఆందోళనా కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా సంఘం ఆధ్వర్యంలో గ్రామాల్లో కరపత్రాలు, వాల్‌పోస్టర్లుతో విస్తృతంగా ప్రచారం నిర్వహించింది.

27వ తేది మధ్యాహ్నం 12 గంటలకు రంపచోడవరం చేరుకున్న ప్రజలు, ప్రభుత్వ ఆసుపత్రివద్ద నుండి ఊరేగింపుగా బయలుదేరి మారేడుమిల్లి సెంటర్, దేవిగుడి, దేవిపట్నంరోడ్ సెంటర్, మెయిన్‌రోడ్, తహసిల్‌దార్ కార్యాలయం మీదుగా ఐటిడిఏ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ప్రదర్శనకారులు "సాగుదారులైన గిరిజనులకే పట్టాలు ఇవ్వాలని", "గిరిజనులందరికీ కొండపోడు పట్టాలు ఇవ్వాలని", "భూస్వాముల వద్దనున్న సెటిల్‌మెంట్ ఆర్డర్లు రద్దుచేయాలని" "కురమగొంది గిరిజనులకు సాగు రికార్డులు నమోదు చెయ్యాలని" "సాగునీరు, తాగునీరు సౌకర్యం కల్పించాలం"టూ నినాదాలు చేశారు.

అనంతరం ప్రారంభమైన ధర్నా కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం అధ్యక్షులు కా॥ఇల్లా రామిరెడ్డి, రై.కూ.సం.(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ఎం.ఎస్.నాగరాజు, ఏజెన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కా॥కుండ్ల గంగరాజు మాట్లాడారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమైన ధర్నా కార్యక్రమం సాయంత్రం 7 గం॥ల వరకు జరిగింది. అనంతరం గిరిజనుల భూమిసమస్య పరిష్కారం కోరుతూ, మరియు ఇతర సమస్యలపై సంఘం రూపొందించిన మెమోరాండంతో పాటు ధర్నాకు హాజరైన గిరిజన ప్రజలు వారి వారి గ్రామాల సమస్యల పరిష్కారం కోరుతూ తీసుకువచ్చిన సుమారు 150 విజ్ఞాపన పత్రాలను ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి అందజేశారు. ఒక గంటపాటు జరిగిన చర్చలలో సానుకూలంగా స్పందించిన పీ.ఓ. ఈ సమస్యల పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకుంటానని, ముఖ్యంగా భూమి సమస్యపై సాధ్యమైనంత త్వరగా గిరిజనులను సాగుదారులుగా నమోదుచేసి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 800మంది హాజరైన ఈ ధర్నా కార్యక్రమంలో ఇంకా వీరపురెడ్డి, మడం పండయ్య, కుంజం జోగారావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ✤




నర్సంపేటలో గ్యాస్, డీజిల్ ధరల పెంపుకు స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో నిరసన; బందరులో మహిళల నిరసన


ఒంగోలులో దిష్టిబొమ్మ దగ్ధం

**వంటగ్యాస్...** (చివరి పేజీ నుండి)

ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఐ (ఎం-ఎల్) నాయకులు జక్కుల తిరుపతి పాల్గొని, హాజరైన ప్రజల నుద్దేశించి ప్రసంగిస్తూ ఈ పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నిర్మించాల్సిన అవసరం వుందన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కామ్రేడ్ భూమా అశోక్, ఎం. శ్రీలత, ఎమ్ దేవేంద్ర, కె. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**నర్సంపేట, 28-6-11 :**

పెట్రో ఉత్పత్తులపై ప్రభుత్వం నియంత్రణలన్నీ ఎత్తివేస్తున్న ఫలితంగా అడ్డూ అదుపూ లేకుండా వీటి ధరలు పెరిగిపోతూ సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనాన్ని మరింత ఇబ్బందుల పాల్జేస్తున్నాయనీ, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రజా వ్యతిరేక విధానాల్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. అనంతరం ఆర్‌డిఓకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన వరంగల్‌జిల్లా కార్యదర్శి కా॥ మోడెం శ్రీలత; జిల్లా నాయకులు కా॥ మేక దేవేంద్ర; సుజాత, అనిత తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**విజయవాడ, 29-6-11 :**

రాష్ట్రస్థాయిలో 11 రాజకీయ పార్టీలు, పెంచిన డీజిల్, గ్యాస్, కిరోసిన్ ధరలు తగ్గింపుకై డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాపితంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించమని ఇచ్చిన పిలుపులో భాగంగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బందరు రోడ్డుపై ధర్నా నిర్వహించారు.

ఈ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ పాల్గొని ప్రసంగిస్తూ, మన దేశంలో పుష్కలంగా చమురు, సహజవాయువు వనరులు వున్నప్పటికీ పెద్దస్థాయిలో చమురు ఉత్పత్తులను కేంద్ర పాలకులు దిగుమతి చేసుకుంటున్నారనీ, ఆయిల్ వనరులపై ప్రపంచాధిపత్యం వహించిన గుత్త కంపెనీలకు మన పాలకులు ఊడిగం చేస్తున్నారనీ ఈ నేపథ్యంలో చమురు దిగుమతులను తగ్గించి, మనదేశంలోని వనరులన్నింటినీ వినియోగంలోకి తెచ్చి, ప్రజలకు అందుబాటులో వుంచాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నా శిబిరంలో సిపిఐ (ఎం-ఎల్) లిబరేషన్ నాయకులు కళ్యాణకృష్ణ, న్యూడెమోక్రసీ నాయకులు రామారావు, సిపిఐ నాయకులు సూర్యదేవర నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు వి. ఉమామహేశ్వర రావు తదితరులు ప్రసంగించారు. సిపిఐ(ఎం-ఎల్) నగర నాయకులు కామ్రేడ్స్ టి.పూర్ణచంద్రరావు, మీసాల వెంకట్రావు; ఎన్.వై.ఎస్.నాయకులు కా॥ లక్ష్మణ్, వన్‌టౌన్, టుటౌన్‌నుండి మహిళలు ధర్నాలో పాల్గొన్నారు.

**నర్సంపేట, 29-6-11 :**

11 రాజకీయ పార్టీలు ఇచ్చిన రాష్ట్ర పిలుపులో భాగంగా నర్సంపేటలో సిపిఐ (ఎం-ఎల్) సిపిఐ, సిపిఎం, ఎమ్‌సిపిఐ, న్యూడెమోక్రసి పార్టీల ఆధ్వర్యంలో వరంగల్ క్రాస్‌రోడ్‌వద్ద 300 మందితో రాస్తారోకో నిర్వహించి, అక్కడనే కట్టెలతో పొయ్యి వెలిగించి వంటచేసే ప్రయత్నం చేశారు-పోలీసులు వారందరినీ చెల్లాచెదురు చేశారు. అనంతరం అదే సెంటరులో జరిగిన సభలో ఇతర పార్టీల నాయకులతో పాటు సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ మోడెం మల్లేష్ ప్రసంగిస్తూ పెరిగిన ధరలు ఉపసంహరించుకునేంత వరకూ ఈ ఉద్యమాలు సాగాలన్నారు.

వరంగల్ ఏకశిల పార్క్‌వద్ద జరిగిన ధర్నాలో సిపిఐ (ఎం-ఎల్) నాయకులు ఐలన్న పాల్గొనగా, రైతుకూలీ సంఘం జిల్లాకార్యదర్శి ఎమ్‌డి. యాకూబ్ ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం-ఎల్) నాయకులు ఈర్లపైడి; సిపిఐ నాయకులు రమేష్; సిపిఎమ్ నాయకులు పెద్దారపు రమేష్; ఎమ్‌సిపిఐ నాయకులు గాదగోని రవి; సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

**నిజమాబాద్, 29-6-11 :**

11 రాజకీయ పార్టీల రాష్ట్ర పిలుపులో భాగంగా స్థానిక తిలక్ గార్డెన్ నుండి వివిధ పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రదర్శన, కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం జరిగాయి సిపిఐ(ఎం-ఎల్) నాయకులు కా॥గంగుల నర్సయ్య ఈ ధర్నాలో ప్రసంగిస్తూ డీజిల్ ధరలు సగానికి సగం తగ్గవలసివుండగా, పెద్ద ఎత్తున పెరుగుతుండటానికి చమురు కంపెనీలపై నియంత్రణను ప్రభుత్వం ఎత్తివేసుకోవటమే కారణమన్నారు.

ఈ ధర్నాలో సిపిఐ (ఎం-ఎల్) న్యూడమోక్రసీ జిల్లా కార్యదర్శి కె. యాదగిరి; సిపిఎం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు; సిపిఐ జిల్లా కార్యదర్శి కంజర భూమయ్య, రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు జి. మల్లేష్ కె. మారుతి, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పిడుగురాళ్ళ, 29-6-11 :**

11రాజకీయ పార్టీల పిలుపులో భాగంగా పట్టణంలో ప్రదర్శన, స్థానిక ఐలాండ్ సెంటర్‌లో రాస్తారోకో, అనంతరం తహసిల్‌దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నాయకులు కాంద్రకుంట ముసలయ్య, నీలాద్రి రాంబాబు; స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ నిర్మల పాల్గొని ఈ ధరల పెరుగుదల పెద్ద భారంకాబోదన్న కేంద్ర మంత్రుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ పార్టీల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు.

**రెంటచింతల, 25-6-11 :**

పెట్రో ఉత్పత్తుల ధరల పెంపుదలను నిరసిస్తూ గుంటూరుజిల్లా రెంటచింతల మండల కేంద్రంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ప్రదర్శన, మాచర్ల రహదారిపై రాస్తారోకో, అనంతరం తహశీల్‌దారు కార్యాలయం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ పి. కోటేశ్వరరావు, ఏపిఎఫ్‌టియు నాయకులు బి. మరియదాసు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో నేడు బ్యారల్‌కు 90 డాలర్లకు చేరినప్పటికీ డీజిల్ ధర సగానికి సగం తగ్గక పోగా మరింత పెరిగిపోవటాన్ని తీవ్రంగా నిరసించారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం మండల నాయకులు కా॥ పాలకుర్తి సత్తెయ్య, చైతన్య నాపరాయి లోడింగ్, అన్‌లోడింగ్ అధ్యక్షులు కా॥ మామిడి సామియేలు; చైతన్య పంచాయితీ స్వీపర్స్ యూనియన్ నాయకులు ఆదాం; శ్రీను, సుందర్రావు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

**రెంటచింతల, 29-6-11 :**

11 రాజకీయ పార్టీల రాష్ట్ర పిలుపులో భాగంగా మండల కేంద్రమైన రెంటచింతలలో ప్రదర్శన, రాస్తారోకో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎఫ్‌టియు నాయకులు బి. మరియదాసు డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీల భారం మరింత పెరగనున్నదనీ, ధరల తగ్గింపుకై ఆందోళనను తీవ్రం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘ కార్యకర్తలు పి. సత్తెయ్య, రాముడు, బాబూరావు; సిపిఐ నాయకులు కె. రంగనాయకులు, సిపిఎం నాయకులు టి. నాగేశ్వరరావు; న్యూడెమోక్రసీ నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

**కారంపూడి, 29-6-11 :**

రాష్ట్ర, కేంద్ర, ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్‌పై పెద్ద ఎత్తున పన్నులు విధిస్తూ ధరలను పెనుభారంగా మోపుతున్నారని రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో కా॥ పద్మ పాల్గొని ప్రసంగించారు. తొలుత స్థానిక సినిమాహాల్ సెంటర్ నుండి, బస్టాండు వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ వెంకటరత్నం, సుబ్బమ్మ, అనిల్, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

**గోపాలపురం, 29-6-11:**

ఏజన్సీ గిరిజన సంఘం; రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)ల నాయకత్వంలో పశ్చిమగోదావరిజిల్లా గోపాలపురం మండల కార్యాలయం వద్ద 100మందికి పైగా రైతు,కూలీలు ధర్నా చేశారు. ఈ ధర్నాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు నశించాలని, పెంచిన పెట్రో ధరలను తగ్గించాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి వెంటనే కొనుగోలు చెయ్యాలని; ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ళ స్థలాలుఇచ్చి, ఇళ్ళు నిర్మించాలని నినాదాలు చేశారు. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు ధర్నా నిర్వహించి, రెవిన్యూ అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్స్ కలుం గంగాదేవి, సవలం రాంబాబు, తదితరులు నాయకత్వం వహించారు.

**పోలవరం 29-6-11:**

ఏజన్సీగిరిజన సంఘం; ఎన్‌వైఎస్‌లు సంయుక్తంగా పెట్రోధరలపెంపునకు వ్యతిరేకంగా పశ్చిమ గోదావరిజిల్లా పోలవరం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించాయి. అనంతరం పోలవరం గ్రామంలో ప్రదర్శన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను గట్టు సెంటర్‌లో దగ్ధంచేశారు. ఈ కార్యక్రమానికి ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కామ్రేడ్ పద్దం కృష్ణమూర్తి, ఎన్‌వైఎస్ నాయకులు కా॥మిడియం రవి తదితరులు నాయకత్వం వహించారు. ✤

# ప్రజల జీవనాన్నీ, పర్యావరణాన్నీ విధ్వంసంచేసేదే పాలకుల 'అభివృద్ధి నమూనా!'

## ఉత్తరాంధ్ర రైతుకూలీ సంఘం సదస్సులో ప్రొ॥కె.ఆర్.చౌదరి విశ్లేషణ

ఉత్తరాంధ్ర సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొ॥ కె.ఆర్ చౌదరి; సదస్సుకు హాజరైన ప్రతినిధులు




**శ్రీకాకుళం, 10-7-11:**

'బహుళజాతి సంస్థల ప్రయోజనాలకోసం ప్రజాజీవితాన్ని ఛిద్రంచేస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటాలకు సమాయత్త మవుదాం' అని పిలుపునిస్తూ రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల సదస్సు స్థానిక వైయస్ఆర్ కళ్యాణమండపంలో జరిగింది.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥టి.అరుణ ఈ సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకోసం దేశ ప్రజలను బలితీసుకోవటానికైనా మన పాలకులు వెనుకాడరని మొన్న సోంపేట, నిన్న కాకరాపల్లి ఘటనల నేపథ్యంలో ఈ సదస్సు జరుపుకుంటున్నామని సదస్సు ప్రాధాన్యతను వివరించారు.

ఈ సదస్సులో ప్రధానవక్తగా వచ్చిన ప్రముఖ వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ కె.ఆర్.చౌదరి మాట్లాడుతూ పాలకులు జబ్బలు చరచుకుంటున్న 'అభివృద్ధి నమూనా' యొక్క వాస్తవ రూపమైన ప్రజాజీవన విధ్వంసాన్నీ, పర్యావరణ విధ్వంసాన్నీ సోదాహరణంగా విశ్లేషించారు.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలుచేస్తున్న ఈ దోపిడీ పాలకుల పాలనలో ప్రజల నిజమైన అభివృద్ధి సాధ్యంకాదన్నారు. మనదేశ జనాభాలో ఇప్పటికే 50కోట్లమంది పేదరికంతో అలమటిస్తున్నారనీ, 3కోట్లమంది బిచ్చగాళ్ళు, 15 కోట్లమంది నిరుద్యోగులు, 20కోట్లమంది ఏ ఉపాధీలేనివారు, పదికోట్లకుపైగా బాలకార్మికులూ వున్నారని చెప్పారు. ఏనాడో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు రూపొందించిన 1894 భూసేకరణ చట్టాన్నే నేటికీ ఈ 'స్వతంత్ర' పాలకులు అమలు చేస్తున్నారనీ, గత 63 సం॥ల కాలంలో 3 కోట్ల ఎకరాల సాగుభూములను ప్రజలనుండి ప్రభుత్వం గుంజుకోని వ్యవసాయేతర అవసరాలకు మళ్ళించిందని, తద్వారా ఉపాధి కోల్పోయినవారు 14 కోట్లమందికి పైగా ఉన్నారనీ ఆయన వివరిస్తూ భూసేకరణ జరపటానికి ఉనికిలోవున్న జాతీయ, అంతర్జాతీయ నియమ నిబంధనలను కూడా మన పాలకులు తుంగలో తొక్కుతున్నారని తీవ్రంగా విమర్శించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో ఆరు థర్మల్, ఒక అణువిద్యుత్ కర్మాగారాల నిర్మాణాలకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ పేరిట వేలాది ఎకరాల భూములను పేదలనుండి గుంజుకొని ఈ పరిశ్రమ యజమానుల పరంచేస్తున్నారని, ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, రైతుకూలీలు, చేతివృత్తుల, గ్రామీణ పేదలతో సహా తీరప్రాంతంలో అధిక సంఖ్యలోనున్న మత్స్యకారులు కూడా తమ జీవనాన్ని కోల్పోనున్నారని రానున్న ప్రమాద తీవ్రతను వివరించారు. మన రాష్ట్రంలోని దాదాపు వెయ్యి కిలోమీటర్ల పొడవున్న తీరప్రాంతంలో కోస్టల్ కారిడార్ నిర్మాణం పేరిట లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారనీ కావున అన్నివిధాలా ప్రజాజీవనాన్నీ, పర్యావరణాన్నీ విధ్వంసంగావిస్తూ, సామ్రాజ్యవాద బడాసంపన్నుల ప్రయోజనాలకోసం సాగిస్తున్న ఈ నిర్మాణాల్ని, వీటికి అనుమతులిస్తున్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం ఐక్యంగా పోరాడటం మినహా మరో పరిష్కారంలేదని నొక్కిచెపుతూ ప్రొఫెసర్ చౌదరి తన ఉపన్యాసాన్ని ముగించారు.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥యస్.ఝాన్సీ మాట్లాడుతూ వర్గవ్యత్యాసాలు తీవ్రంగా పెరిగిపోతూవుంటే ఈ అభివృద్ధి ఎవరిదని సూటిగా ప్రశ్నించారు. సోంపేట, కాకరాపల్లి విద్యుత్ కర్మాగారాల్లో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల నాయకులే

(తరువాయి 6వ పేజీలో)

కా॥ తరిమెల నాగిరెడ్డి 35వ వర్థంతి సందర్భంగా
**6-8-2011 శనివారం ఉదయం 10 గంటలకు**
**సుందరయ్య విజ్ఞానకేంద్రం, హైదరాబాద్‌లో**
**'తాకట్టులో భారతదేశం-నేటికీ దాని ప్రాధాన్యత' పై సదస్సు**
**ఉపన్యాసకులు :**
కా॥ అరవిందసిన్హా సిపిఐ(ఎం.ఎల్)
కా॥ సుబోధ్ మిత్రా ఎఐకెఎమ్‌కెఎస్
కా॥ సుబ్రతోబసు సిపిఐ(ఎం.ఎల్)
కా॥ జి.విజయకుమార్ ఏపిఎఫ్‌టియు
కా॥ పి.జస్వంతరావు టిఎన్ఎం ట్రస్టు
**టి.ఎన్.మెమోరియల్ ట్రస్టు**

# వంట గ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరల పెంపుకు నిరసన

*ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా పెట్రోఉత్పత్తుల ధరలను పెంచివేసింది. డీజిల్‌పై లీటరుకు 3/- రూ॥లు; కిరోసిన్‌పై లీటరుకు 2/- రూ॥లు, వంటగ్యాస్ సిలిండర్‌పై 50 రూ॥లు పెంపుదలతో ప్రధానంగా సామాన్య, మధ్యతరగతి ప్రజానీకంపై 21వేల కోట్ల రూపాయల భారాన్ని మోపింది. ఈ పెంపుదలను నిరసిస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వివిధ సంఘాల ఆధ్వర్యంలోనూ, 11 రాజకీయ పార్టీల రాష్ట్ర పిలుపులో భాగంగా జూన్ 29న వివిధ ప్రాంతాలలోనూ జరిగిన ఆందోళనా రిపోర్టులు అందిన మేరకు ప్రచురిస్తున్నాం. – సంపాదకుడు*

**పిడుగురాళ్ళ, 25-6-11 :**

కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున వంటగ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరల పెంపు ద్వారా ప్రజలపై మోపిన భారాలను నిరసిస్తూ, రైతుకూలీ సంఘం, స్త్రీ విముక్తి సంఘటన, నవయువ సమాఖ్యల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. తొలుత స్థానిక ఏపిఎఫ్‌టియు కార్యాలయం నుండి ఏడుకొట్ల సెంటర్ మీదుగా ప్రదర్శన సాగి, మండల తహసిల్‌దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు కా॥ ఎన్. రాంబాబు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా నాయకులు కా॥ ఎం. నిర్మల, ఎన్.వై.ఎస్. స్థానిక నాయకులు కా॥ జాని ధర్నాలో పాల్గొన్న ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం పదేపదే పెట్రోఉత్పత్తుల ధరలను పెంచుకుంటూ పోవటంతో పేద, మధ్యతరగతి ప్రజల జీవనం పెనుభారంగా మారుతున్నదన్నారు.

**బందరు, 26-6-11 :**

పెంచిన గ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక కోనేరుసెంటర్‌లో స్త్రీవిముక్తి సంఘటన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన పట్టణ అధ్యక్షులు తిరుమలశెట్టి నాగలక్ష్మి; రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ జగన్, పామర్తి అంజమ్మ ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. ఈ ధరలను పెంచటం ద్వారా మన రాష్ట్రంలోనే పేద మధ్యతరగతి ప్రజలపై ప్రభుత్వం 2,570 కోట్ల పైగా భారం మోపిందనీ, ఈ ధరల ప్రభావం ఇతర ఆహార పదార్థాలు,రవాణావంటి అన్నింటిపై విస్తరించి సామాన్యుడి జీవనం దుర్లభమవుతుందని వారు తమ ఉపన్యాసాల్లో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు.

ఇంకా ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకులు అనిశెట్టి నాగేశ్వరమ్మ, ఎన్.వై.ఎస్. నాయకులు హనుమంతు, రైతుకూలీసంఘం నాయకులు లీలా మనోహర్, రాంబాబు పాల్గొన్నారు.

**ఒంగోలు, 26-6-11 :**

సిపిఐ(ఎం-ఎల్) ప్రకాశం జిల్లాశాఖ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మతో పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక స్వభావాన్ని ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజలనుద్దేశించి, సిపిఐ(ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ పి. లలితకుమారి మాట్లాడుతూ పెట్రోలుపై నియంత్రణను ఎత్తివేసిన పాలకులు, డీజిల్‌పై ఆ బాటలో వున్నారని, కేంద్ర, రాష్ట్రపాలకులు తమతమ పన్నుల ద్వారానే అసలు ధరకంటే అధికంగా వసూలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు.

ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కా॥ ఎం.ఎస్. సాయి, జిల్లా నాయకులు కా॥ కత్తి పేరయ్య; రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ వేజెండ్ల రామారావు, ఉపాధ్యక్షులు కా॥ కోటేశ్వరరావు; వి. శ్రీరాములు, ఎన్.వై.ఎస్. నాయకులు ఎం. శ్రీనివాసరావు; స్త్రీ విముక్తి సంఘటన నాయకులు కా॥ రేణుక, పి. శాంత, పిడిఎస్ఓ నాయకులు కా॥ స్ఫూర్తి తదితరులు పాల్గొన్నారు.

**గిర్నిబావి, 28-6-11 :**

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావి సెంటర్‌లో-కేంద్రప్రభుత్వం పెంచిన డీజిల్, గ్యాస్ ధరల పెనుభారాన్ని నిరసిస్తూ సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. (తరువాయి 7వ పేజీలో)

గ్యాస్, డీజిల్, కిరోసిన్ ధరల పెంపును నిరసిస్తూ ఐక్యకార్యాచరణ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ధర్నా; పిడుగురాళ్ళలో ప్రదర్శన; నర్సంపేటలో రాస్తారోకో



Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010